ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.0
****
నల్లగొండ
5
సోమవారం 25 ఆగస్టు 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	4,16,324	4,16,324
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.45 (4.06)	2,571	1,702
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	166.20 (33.18)	3,87,101	3,81,796

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

నామినేటెడ్‌పై ఆశలు



పదవుల పందేరం అనంతరం స్థానిక ఎన్నికలకు

- సెప్టెంబరు నెలాఖరులోగా కొలిక్కి తెచ్చే యోచన
- వినాయక చవితి నుంచి నిమజ్జనం లోగా నామినేటెడ్ భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కాంగ్రెస్ కోర్‌కమిటీలో కీలక నిర్ణయం
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల నియామకాలపై కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. గణేశ్ నిమజ్జనంలోపే నామినేటెడ్ పదవులను భర్తీచేయాలని శనివారం జరిగిన పార్టీ కోర్‌కమిటీ, పీఏసీ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజ్యాంగ, న్యాయనిపుణులతో చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటుచేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందకపోవడంతో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులతో కూడిన కమిటీని కాంగ్రెస్ నియమించింది. వీరు రాజ్యాంగ, న్యాయనిపుణులతో సంప్రదించాలని నిర్ణయించింది. ఈనెల 29న జరిగే క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై తుది నిర్ణయం తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వీలైనంతమేరకు అధికారికంగా 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే వెళ్లాలని,లేని పక్షంలో పార్టీపరంగానైనా రిజర్వేషన్ కల్పించి స్థానిక ఎన్నికల ప్రక్రియను కోర్టు విధించిన సెప్టెంబరు నెలాఖరు గడువులోగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈలోగా గణేశ్ చతుర్థి నుంచి నిమజ్జనం జరిగే లోపు నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తిచేయాలని నిర్ణయించింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పదవులనూ భర్తీ చేయాలని, ఇప్పటికే ఆశావహుల జాబితాలను పార్టీ జిల్లా పరిశీలకులు, ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అధిష్ఠానానికి, సీఎంకు చేరవేశారు. నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఉమ్మడి జిల్లాలోనూ ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

నామినేటెడ్‌లో ఛాన్స్ దక్కింది కొందరికే..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్‌కు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. పార్లమెంటు ఎన్నికలకు ముందే తొలి దశలో జరిగిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి (సూర్యాపేట), మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి (ఆలేరు), రాష్ట్ర దివ్యాంగుల

- మిగతా 7వ పేజీలో...

జిల్లా నేతల ప్రయత్నాలు

బీసీ కోటాలో పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నా కైలాష్‌నేత కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి వస్తుందని ఎంపీ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగంగా ప్రకటించారు. అయినా ఇప్పటివరకు ఆయనకు పదవి రాలేదని, ఈ దఫా ఖాయమని క్యాడర్‌లో చర్చ సాగుతోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం రాష్ట్ర కార్పొరేషన్లలో కీలక పదవి ఖాయమైందని చెబుతున్నారు. అయితే సామాజిక, జిల్లాల సమీకరణాల్లో మొదటి విడతలో ఆయనకు ఛాన్స్ దక్కలేదని, ఈ దఫా ఖాయమంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో..

ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులు వస్తాయనే నమ్మకంలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న, పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు ముత్తవరపుపాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి కూడా పరిస్థితులు అనుకూలిస్తే కీలక పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి, కీలక నేతలు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, పంజాల రామాంజనేయులుగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, లింగంయాదవ్, తదితర నేతలు కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. వీరితో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన నాయకుల పేర్లను రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. పదవుల పందేరం మొదలయ్యాక ఎవరికి అవకాశం దక్కుతుందో, అవి దక్కని వారిని ఎలా నచ్చజెబుతారనే అంశం తేలనుంది.

చెరువులకు హద్దులు ఎలా?

- ముందుకురాని కాంట్రాక్టర్లు
- 2024లో రూ.27.18లక్షల మేర కలెక్టర్ నిధులు
- ఏఎమ్మార్పీ పరిధి నాలుగు డివిజన్లలో తొలి విడత తొమ్మిది చెరువులు
- పనులు దక్కించుకున్నా చేసేందుకు కాంట్రాక్టర్ల అనాసక్తి

చెరువులను ఆక్రమిస్తున్న రియల్టర్లకు చెక్ పెట్టేందుకు ఎఫ్‌టీఎల్‌లో (ఫుల్ ట్యాంక్ లెవెల్) కాంక్రీట్ హద్దు రాళ్ల ఏర్పాటుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. హద్దురాళ్ల ఏర్పాటుకు నిధులు సరిపోవని, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నార్కట్‌పల్లి పెద్ద చెరువు హద్దు రాళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఒకే ఒక కాంట్రాక్టర్ కూడా పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. అదే సమయంలో నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు బీ.వెల్లెంల రిజర్వాయర్ ద్వారా నీరు చేరడంతో ఎఫ్‌టీఎల్ పనుల కొనసాగింపు డైలమాలో పడగా, మిగతా చెరువుల విషయంలోనూ ఏ కాంట్రాక్టరూ ఆసక్తి చూపడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)



నార్కట్‌పల్లి పెద్ద చెర్వు, నిర్మించనున్న ఎఫ్‌టీఎల్ కాంక్రీట్ పిల్లర్ నమూనా

జిల్లాలో విలువైన చెరువు భూములపై కన్నేసిన రియల్టర్ల కబ్జా పర్వానికి తెరదించాలని గత కలెక్టర్ నారాయణరెడ్డి భావించారు. చట్టంలోని లొసుగులను, అధికారులను అవినీతిని ఆసరా చేసుకొని శిఖం స్థలాలను వెంచర్లుగా మార్చి చేస్తున్న దందాకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సంకల్పించారు. అందులో భాగంగా ఎఫ్‌టీఎల్‌ను (ఫుల్ ట్యాంక్ లెవెల్) గుర్తించి హద్దురాళ్లను పక్కాగాఏర్పాటు చేయడమే సమస్యకు పరిష్కారంగా భావించారు. మున్ముందు ఆక్రమణలకు తావులేని శాశ్వత పరిష్కారానికి మార్గంగా చెర్వులకు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారించి కాంక్రీట్ పిల్లర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా చెర్వుల ఆక్రమణలకు పాల్పడితే సులువుగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని భావించారు.

ప్రతిపాదనలకు పరిపాలనా అనుమతులు

చెరువులు ఆక్రమణకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఏఎమ్మార్పీ పరిధిలోని నాలుగు డివిజన్లకు చెందిన...

- మిగతా 8వ పేజీలో...

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ



కనగల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సింగం లక్ష్మీనారాయణ

కనగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ నెల 25న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష వాల్ పోస్టర్‌ను ఆదివారం బోయినపల్లి గ్రామంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంసల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. బీసీ మేధావులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో సత్యాగ్రహ దీక్షకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షం, యాదయ్య, నగేష్, శంకరయ్య, మహేష్, కిరణ్, రామలింగం, మురళి, నర్సింహ, ప్రసాద్, లక్ష్మణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



బుద్ధవనం లోపల కుటుంబ సభ్యులతో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

నాగార్జునసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. బుద్ధవనానికి చేరుకున్న ఆయనకు ఈవో రవిచంద్ర కండువా కప్పి సన్మానించారు. అనంతరం మహాస్థూపం లోపల బుద్ధజ్యోతిని నారాయణ్ అమిత్ వెలిగించారు. తదుపరి సాగర్ ప్రధానడ్యాం, ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. సాగర్, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. ఆయన వెంట ప్రోటోకాల్ ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు నల్లగొండకు ఇద్దరు మంత్రుల రాక

నల్లగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం నల్లగొండ పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 10.40గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపీ యూనిట్‌కు వారు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మెడికల్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇద్దరు మంత్రుల రాక సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు, రేపు ఎన్జీ కళాశాలలో జాతీయ సదస్సు

నల్లగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో జీవశాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 25, 26న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, సదస్సు సంచాలకుడు ఎం.అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, జీవశాస్త్రాల పాత్ర అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందన్నారు. సదస్సును హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ రామాచారి, ఆచార్యులు రాధాకృష్ణన్ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రొఫెసర్లు పాల్గొని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలను వివరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకొని పఠన సమర్పణ చేయవచ్చని తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి 'నవోదయ'లో తరగతులు

- మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో

కలిసి ఉన్నత స్థాయి సమీక్ష



హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ/ కోదాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కోదాడలో ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు వీలుగా ఈలోపే భవనాల నిర్మాణం, ఇతర అకాడమిక్ ఏర్పాట్లు పూర్తి చేయాలని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కోదాడలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయం భవన నిర్మాణం, పనుల పురోగతిపై కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, జవహర్ నవోదయ విద్యా సొసైటీ అధికారులతో ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యాలయ నిర్మాణానికి నిర్మాణ 19.12ఎకరాల స్థలాన్ని కేటాయించామని, నిర్మాణాల కోసం రూ.50కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనుల నిర్మాణంలో జాప్యం లేకుండా, నాణ్యతలో రాజీ పడకుండా చేపట్టాలని ఆయన సూచించారు. భవనాల నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని నొక్కి చెప్పారు. మొత్తం క్యాంపస్ వాతావరణం చూడగానే విద్యార్థులకు స్వాగతం పలికేలా ఉండాలని మంత్రి సూచించారు. ఈ ప్రాజెక్టులో నిర్మించే విద్యా భవనాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, వినోద ప్రదేశాల నిర్మాణాలు భవిష్యత్తు అవసరాలకు లోపం లేకుండా ఉండేలా కేటాయించాలని సూచించారు. ఎన్‌వీఎస్ (నవోదయ విద్యా సమితి) ప్రధాన కార్యాలయం ఇప్పటికే టెండర్లను ఖరారు చేసిందని పేర్కొన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడు తూ భవనాలు, ఇతర నిర్మాణాలపై విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా మార్పులు, చేర్పులు సూ చించారు. కోదాడకు ఈ ప్రతిష్ఠాత్మక విద్యాలయం రావడం గర్వకారణమని, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అంద రూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భం గా క్యాంపస్‌లో ప్రతీ భాగం విద్యార్థుల సౌకర్యం, భద్రత ఉండేలా నిర్మాణం జరగాలని ఆమె సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎన్‌వీఎస్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్‌బేరా, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, ఎన్‌బీసీసీ హైదరాబాద్ డీజీఎం అబ్దుల్ రహీం, పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు..
పర్యాటకుల కేరింతలు
7
మట్టి గణనాథులనే పూజిద్దాం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, జీవన విధానం మారుతుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి తెలిపారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంవీఎన్‌సీ విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయి యోగా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. యోగాసనాలు వేయడం జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. యోగా పోటీలో జిల్లావ్యాప్తంగా 90మంది బాలబాలికలు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను విజేతలుగా ప్రకటించి మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, ఎస్జీఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కోశాధికారి షహీద్, యోగా కోచ్‌లు నాగార్జున, ఎంవీఎన్‌సీ కార్యదర్శి నర్సిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: 8-10 ఏళ్ల బాలుర విభాగంలో ఎం.వేదాంత్, ఆర్.సాయి నిషాంత్, పి.అజయ్‌కుమార్, కె.షాన్విత్, జె.హాసీష్, బాలికల విభాగంలో దిష్టాశ్రీ, కె.శ్రీవిద్య, శ్రీవేదశ్రీ, వర్షిక, కావ్యశ్రీ, 10-12 ఏళ్ల బాలికల విభాగంలో అభిలాషి, శ్రీదేవి, లహరి, బాలుర విభాగంలో కె.అభిరాం, సృజన, శశి విక్రం, హర్షిత్, కార్తీక్ విజేతలుగా నిలిచారు.



ఆసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎనిమిది టర్బైన్ల నుంచి విద్యుదుత్పత్తి

జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని టర్బైన్‌లు

నాగార్జునసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొదటి టర్బైన్ మరమ్మతులు పూర్తయిందని, ఎనిమిది టర్బైన్ల నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, అందులో మొదటి టర్బైన్ 110 మెగావాట్ల సామర్థ్యం ఉందని, మిగిలిన ఏడు టర్బైన్లలో ఒక్కో టర్బైన్ 110..8 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉన్న ఎనిమిది టర్బైన్‌ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు అని తెలిపారు. మొదటి టర్బైన్‌ను బీహెచ్‌ఈఎల్ నుంచి 1978లో కొనుగోలు చేసి అమర్చినట్లు పేర్కొన్నారు. ఈ టర్బైన్‌కు మరమ్మతులు చేసి 20సంవత్సరాలు అవుతుండడంతో క్యాపిటల్ ఓవరాల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి టర్బైన్ గైడ్‌వేన్లు అరగడంతో(వార్న్‌అవుట్) విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో, నిలిపివేసిన సమయంలో కాడా నీటి వృథా(నీరు లీకేజీ) ఎక్కువగా అవుతుందని అలా నీటి వృథాతో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయడం కష్టమవుతుందని తెలిపారు. అందుకే బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.7.50 కోట్ల వ్యయంతో నూతన గైడ్ వేన్ మెకానిజాన్ని కొనుగోలు చేసినట్ల సీఈ తెలిపారు. అరిగిన టర్బైన్ గైడ్ వేన్‌ల స్థానే కొత్తవి ఏర్పాటు చేశామని తెలిపారు. మరమ్మతుల కోసం రూ.55లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. మరమ్మతులు పూర్తి కావడంతో శనివారం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఎనిమిది టర్బైన్‌ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ రహితం.. సమాజ హితం

» జ్యూట్ బ్యాగులకు పెరిగిన ఆదరణ
» బ్యాగుల తయారీపై మహిళలకు శిక్షణ
» స్వయం ఉపాధి పొందుతున్న వైనం



దేవరకొండలో మహిళలు తయారు చేసిన జ్యూట్ బ్యాగులు

ప్లాస్టిక్ కవర్లను నిషేధించడంతో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జ్యూట్ బ్యాగులకు ఆదరణ పెరుగుతోంది. ప్లాస్టిక్ కవర్ల వినియోగం హానికరమని డాక్టర్లు సూచిస్తుండడంతో ప్లాస్టిక్ వినియోగం కొంతమేర తగ్గింది. జ్యూట్ బ్యాగుల వినియోగంతో పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదని నిపుణులు సూచిస్తున్నారు. జ్యూట్ బ్యాగులను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తూ కొన్ని సంస్థలు మహిళలకు శిక్షణ, స్వయం ఉపాధి కల్పిస్తున్నాయి.

– ఆంధ్రజ్యోతి, దేవరకొండ

నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో దేవరకొండకు చెందిన యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, గ్రీన్‌మ్యారో సంస్థ మూడు సంవత్సరాలుగా దేవరకొండలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రీన్‌మ్యారో సహకారంతో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తోంది. ఇప్పటివరకు పట్టణానికి చెందిన 120మందికిపైగా మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందారు. అదేవిధంగా బ్యాగులు తయారు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

రాజస్థాన్, హైదరాబాద్ నుంచి మెటీరియల్, సామాగ్రి..

జ్యూట్ బ్యాగుల తయారీకి ఉపయోగించే మెటీరియల్, వస్త్రాలు, వస్తువులు రాజస్థాన్, హైదరాబాద్ పట్టణాల నుంచి దిగుమతి చేస్తారు. దాతల సహకారంతో 2022లో పది మిషన్లు కోల్‌కతా నుంచి తెప్పించి మహిళలకు శిక్షణతోపాటు ఉపాధి కల్పిస్తున్నారు. దీని ద్వారా రోజుకు ఒక్కో మహిళ రూ.200 నుంచి రూ.500 వరకు సంపాదిస్తున్నారు. ఒక్కో జ్యూట్ బ్యాగు రూ.10 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. మహిళలు తయారు చేసిన జ్యూట్ బ్యాగులను రాజస్థాన్, హైదరాబాద్ నుంచి వ్యాపారులు దేవరకొండకు వచ్చి హోల్‌సేల్‌గా తీసుకెళ్తున్నారు. జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందినవారు స్వయంగా జ్యూట్ బ్యాగులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మహిళలకు యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, గ్రీన్‌మ్యారో సొసైటీలు స్వయంగా ఉపాధి కల్పిస్తూ సహకరిస్తున్నాయి.

శిక్షణతోపాటు ఉపాధి కల్పిస్తున్నాం



శిక్షణ కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పిస్తున్నాం. ఇప్పటివరకు వంద మందికిపైగా సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది బ్యాగులను తయారు చేస్తున్నారు. రోజుకు రూ.500వరకు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. బ్యాంక్‌లు సహకరిస్తే మరికొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తాం.

– ఉమాదేవి, గ్రీన్‌మ్యారో నిర్వాహకురాలు

రోజుకు రూ.300 నుంచి 400వరకు ఉపాధి పొందుతున్నాం



యాక్షన్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, గ్రీన్‌మ్యారో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాగుల తయారీ కేంద్రంలో ఉపాధి పొందుతున్నాను. రోజుకు రూ.300 నుంచి 400 వరకు సంపాదిస్తున్నాను. మహిళలు శిక్షణ పొంది బ్యాగులు తయారు చేస్తున్నాం.

– సరస్వతి, ఖిల్లాబజార్ దేవరకొండ

అవగాహన కల్పించేందుకు..

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జ్యూట్ బ్యాగులను తయారుచేసి విక్రయిస్తున్నారు. మహిళలకు శిక్షణతోపాటు ఉపాధి కల్పిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ బ్యాగులను తయారు చేస్తున్నారు. దేవరకొండలో తయారుచేసిన జ్యూట్ బ్యాగులకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. యాక్షన్ ఫర్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలు తయారుచేసిన జ్యూట్ బ్యాగులపై అవగాహన కల్పించేందుకు దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా, మైనంపల్లిలలో ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కుట్టుమిషన్లతో జ్యూట్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళలు

ప్రభుత్వం బ్యాగులు కొనుగోలు చేయాలి



దేవరకొండలో సంస్థ ఆధ్వర్యంలో మహిళలు స్వయంగా తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ప్రభుత్వం కొనుగోలు చేసి సహకరించాలి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి జ్యూట్ బ్యాగులు తయారుచేసి విక్రయిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో జ్యూట్ బ్యాగులకు ఆదరణ ఉంది. ప్లాస్టిక్‌ను నిషేధించి జ్యూట్ బ్యాగులకు ఆదరణ కల్పించాలి. ప్రభుత్వం, బ్యాంక్‌లు రుణాలు అందజేస్తే మరిన్ని కుట్టు మిషన్ల కొనుగోలు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

– ఖాజా ఖైరత్, యాక్షన్ ఫర్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకుడు.

వ్యాపారంలో నష్టం.. వ్యాపారి బలవన్మరణం



నాయిని భాస్కర్(ఫైల్)

దేవరకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్తాపానికి గురైన వ్యాపారి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని తాటికోలు గ్రామంలో ఆదివారం జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికోలు గ్రామానికి చెందిన నాయిని భాస్కర్(55) గ్రామంలోనే ఫర్టిలైజర్ మందులతోపాటు కిరాణాషాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా వ్యాపారంలో నష్టం వస్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల బాధ తట్టుకోలేక మనోవేదనతో ఫర్టిలైజర్ షాపులోనే తాడుతో సిలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భాస్కర్ కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. భాస్కర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

డిండి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భూవివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కడారి పెద్దయ్య, కడారి వెంకటయ్య సోదరులు. వారసత్వంగా వస్తున్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి కోర్టు వివాదంలో ఉంది. కోర్టు వివాదంలో ఉన్న వ్యవసాయ భూమిని కడారి పెద్దయ్య దున్నుతుండగా కడారి వెంకటయ్య, అతని కుమారుడు కడారి శివ అడ్డుకున్నారు. కోర్టు వివాదంలో ఉన్న వ్యవసాయ భూమిని సాగు చేయవద్దని చెప్పడంతో మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో కడారి వెంకటయ్య తలకు గాయమైంది. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నీటి సీసాలో నిల్వ చేసిన పురుగుల మందును పొరపాటున సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని దుపెల్లి గ్రామానికి చెందిన నారబోయిన ఉప్పలయ్య(56) కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన రంగయ్య తన ఇంటి ఆవరణలో చెట్లు నరికి పురుగుల మందు పిచికారీ చేస్తుండగా, నీటి సీసాలో నిల్వ చేసిన పరుగుల మందు మిశ్రమాన్ని ఉప్పలయ్య పొరపాటున నీరుగా భావించి తాగాడు. వాంతులు చేసుకోవడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఉప్పలయ్య చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఉప్పలయ్య కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విషపురుగు కుట్టి మహిళ..

చిట్యాలరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళను విషపురుగు కుట్టడంతో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం తాళ్ళవెల్లంల గ్రామంలో ఆదివారం జరిగింది. చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ షాహిన్(39) తాను కూలి పనిచేస్తుంది. భర్త సలీం లారీ డ్రైవర్‌గా చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. షాహిన్ తన నివాసంలో రోజులానే భోజనం చేశాక శనివారం రాత్రి నిద్రకు ఉపక్రమించింది. వేకువజామున ఎడమ కాలికి విషపు పురుగు కుట్టింది. ఈ విషయాన్ని కుమారుడు, కుటుంబ సభ్యులకు చెప్పింది. ఆమెను చికిత్సకోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ షాహిన్ ఆదివారం వేకువజామున మృతిచెందింది. షాహిన్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కనగల్, ఆగస్టు 24:(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బొమ్మెపల్లి గ్రామ వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజీవ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మెపల్లి గ్రామానికి చెందిన తాటికొండ యాదయ్య, తాటికొండ నాగరాజు అనుమతులు లేకుండా గ్రామవాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా కానిస్టేబుల్ నరేష్, హోంగార్డ్ బాలరాజ్ ట్రాక్టర్లను వాగు సమీపంలో పట్టుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి యాదయ్య, నాగరాజులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నృత్యంతో అలరించి..



యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రాయిగిరి మినీ శిల్పారామంలో ఆదివారం నృత్యప్రదర్శనలు అలరించాయి. మంజీరా అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ నాట్యగురువు రేణుక ప్రభాకర్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టున్నాయి. ఆనంద నర్తన గణపతిమ్, అన్నమయ్య కీర్తనలు, ప్రహ్లాద పట్టాభిషేకం, శబ్దం, అష్ట లక్ష్మీస్తోత్రం, వినరోభాగ్యము, దశావతరాల ప్రదర్శనలు అలరించాయి. ● ఆంధ్రజ్యోతి, భువనగిరి గంజ్

పైసలు ఇవ్వందే ఫైల్ కదలదు!

● రికార్డు వెతకడానికి, సంతకం చేయడానికి సంతోషపెట్టాల్సిందే ● మోత్కూరు రెవెన్యూ కార్యాలయంలో ఇదీ తంతు

మోత్కూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అనర్హులకు కల్యాణలక్ష్మి వర్తింపజేసి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు ఆర్‌ఐ సస్పెండ్ అయిన ఘటన మరువక ముందే రెవెన్యూ కార్యాలయంలో ప్రతి పనికీ బేరసారాలు సాగుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను వారు విలేకరులకు వెల్లడించారు.

ఎల్ఆర్ నంబర్ కోసం..

ఆర్‌ఓఆర్ లెటర్ ధ్రువీకరణ పత్రం కోసం ఒకరు, భూమికి సంబంధించిన పహణి నకళ్లకోసం మరొకరు వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరగ్గా డబ్బులు ఇచ్చాకే వారికి రికార్డు అసిస్టెంటు ఆ కాగితాలు ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన బాసోజు అంజయ్యాచారి అనే వ్యాపారి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకోవడానికి వెళ్లాడు. బ్యాంకు వారు అతను ఇచ్చిన కాగితాలు (డాక్యుమెంట్లు) పరిశీలించి అందులో ఎల్ఆర్ నంబర్ ఆర్వోఆర్/3953/2003. 16కాగితం తక్కువ ఉందని చెప్పారు. దాని కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుని వారం రోజులు తిరిగినా పని కాలేదు. ఎందుకు ఇవ్వ డం లేదని అడగ్గా రికార్డు వెతకడానికి రూ.500, డీటీ సంతకం చేయడానికి ఎంత అడుగుతాడో తెలియ దని రికార్డు అసిస్టెంట్ చరణ్ చెప్పాడు.

పహణి నకళ్ల కోసం..

మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి చెందిన మెండు రాధమ్మకు చెందిన భూమి సర్వే నంబర్ తప్పుగా నమోదైంది. దానిని సరి చేయించుకోవడానికి పహణి నకళ్ల కోసం రాధమ్మ మనుమరాలి భర్త శ్రీనివాస్‌రెడ్డి కూడా వారం రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. అతను కూడా వారం రోజులు తిరిగి, ఎందుకు ఇవ్వడం లేదని అడగ్గా రికార్డు అసిస్టెంట్ తాను రికార్డు వెతకడానికి రూ.500, డీటీ సంతకం చేయడానికి రూ.2వేలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. ఇద్దరం స్నేహితులమేనని, రెండింటికి కలిపి ఎంతో కొంత ఇస్తాం కాగితాలు తయారు చేసి ఇవ్వాలని అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి రికార్డు అసిస్టెంట్‌ను కోరారు. అప్పుడు రికార్డు అసిస్టెం టు చరణ్ ఈ నెల 22న అంజయ్యకు సంబంధించిన ఎల్ఆర్ నంబర్ కాగితం, శ్రీనివాస్‌రెడ్డికి అవసరమైన పహణి నకళ్లు వాట్సాప్ ద్వారా కృప ఇంటర్‌నెట్ సెంటర్‌కు పంపగా వారు రూ.300 చెల్లించి అక్కడ కాగితాలు(జిరాక్స్‌లు) తీసుకున్నారు. వాటిని కార్యాలయానికి తీసుకెళ్లి డీటీ సంతకాలు పెట్టించాలని, వాటిని తీసుకెళ్లి డీటీ టెబుల్ పెట్టి ఎంత సేపు వేచి ఉన్నా సంతకాలు చేయ లేదని బాధితులు తెలిపారు. తిరిగి ఈ నెల 23న వారు మళ్లీ కార్యాలయానికి వెళ్లి అడగ్గా రెండింటికీ కలిపి రూ.3,500 అడగ్గా అంత తాము ఇచ్చుకోలేమని వారు బతిమిలాడగా, చివరకు ఆర్వోఆర్ కాగితానికి డీటీకి ఇవ్వనవసరం లేదని, తనకు రూ.300 ఇవ్వాలని, పహణి నకళ్లు వెతికినందుకు తనకు రూ.500, డీటీకి రూ.వెయ్యి ఇవ్వాలని రికార్డు అసిస్టెంటు చరణ్ ఫైనల్‌గా చెప్పాడు. తన వద్ద డబ్బులు లేవనగా రికార్డు అసిస్టెంట్ చరణ్ తనకు సంబంధించిన ఓ వ్యక్తి ఫోన్‌పే నంబరు ఇచ్చి దానికి కొట్టమనగా శ్రీనివాస్‌రెడ్డి మొత్తం రూ.1800 ఫోన్‌పే చేసి స్ర్కీన్ షాట్ చూపించాకే కాగితాలు ఇచ్చారని బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్

ఈ విషయమై తహసీల్దార్ పి. జ్యోతిని వివరణ కోరగా, ఈ విషయం తన దృష్టికి రాలేదని, రికార్డు అసిస్టెంట్ చరణ్ కొందరి వద్ద డబ్బులు తీసుకుంటున్నట్లు తన దృష్టికి కూడా వచ్చిందని తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంజాయి రవాణా.. ఏడుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

నకిరేకల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తూ విక్రయిస్తున్న ఏడుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నకిరేకల్ సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. నల్లగొండకు చెందిన సమీర్, బోరింగ్ సంపత్‌కుమార్, నకిరేకల్‌కు చెందిన ఎన్నమల్ల సాయిరాం, ముక్కాముల అఖిల్, పల్లెబోయిన శివ, శాలిగౌరారానికి చెందిన బండారి వినయ్, చివ్వెంల మండలానికి చెందిన కుంచెం నవీన్‌తోపాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నకిరేకల్, సూర్యాపేట పట్టణాల్లో గంజాయి విక్రయిస్తుండగా పట్టుకొని, వీరి వద్ద నుంచి 290గ్రాముల గంజాయి, ఏడు సెల్‌ఫోన్‌లు, ఒక స్కూటీ, ఆటోను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఎస్‌ఐలు బి. లచ్చిరెడ్డి, జి. కృష్ణాచారి, పోలీస్ సిబ్బంది వై. వెంకటేశ్వర్లు, కె. జనార్దన్, బి. మదుకర్, ఎం. శ్రీనివాస్, ముజీద్, వి. సురేష్, డి. శీకాంత్, ఎం. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సోయగం.. గవ్వలసరి

● తెలంగాణ అరకుగా దేవరచర్ల మునీశ్వర ఆలయం ప్రసిద్ధి ● పర్యాటకులను ఆకట్టుకుంటున్న జలపాతం



దేవరచర్ల మునీశ్వర ఆలయం




చందంపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామ పరిధిలోని గవ్వలసరి ప్రాంతం ఆకట్టుకుంటోంది. ఇక్కడే దేవరచర్ల మునీశ్వర ఆలయం 13వ శతాబ్దాంలో రేచర్ల పద్మనాయకులు నిర్మించినట్లుగా స్థల పురాణం చెబుతోంది. చరిత్ర కలిగిన ఈ ఆలయం పచ్చని అడవులతో ప్రకృతి సౌందర్య దృశ్యాలు, శివలింగంపై జలపాతం నుంచి నిరంతరం జాలువారే నీరు ఈ ఆలయానికి ప్రత్యేకత ఇస్తుంది. తెలంగాణ అరకుగా ప్రసిద్ధి చెందింది. సంవత్సరంలో తొలి ఏకాదశి, శివరాత్రి పర్వదినాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ప్రకృతి ఒడిలో..

నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి ఒడిలో అభివృద్ధికి దూరంలో స్వచ్ఛమైన గాలి, పచ్చని చెట్లు, కొండలు, లోయలు, అమ్రాబాద్ టైగర్‌జోన్, నాగార్జునసాగర్ వెనుక జలాలతో గవ్వలసరి ప్రాంతం మరింత ఆకర్షణీయంగా కన్పిస్తోంది. ప్రకృతి సిద్ధమైన జలపాతం, వర్షాకాలంలో మరింత అందంగా కొండపైనుంచి జాలువారుతున్న నీటిధారలు కొండల మధ్య నుంచి కిందికి దూకే దృశ్యం ప్రకృతి ప్రేమికులను మంత్ర ముగ్దులను చేస్తుంది. ఇక్కడ బోటు సౌకర్యం కూడా ఉంది. దేవరచర్ల శివాలయం, గవ్వలసరి చూడదగ్గ ప్రాంతాలు. .

గవ్వలసరి ఎలా వెళ్లాలంటే

దేవరకొండ నుంచి 55కిలోమీటర్ల దూరంలో ఉన్న గవ్వలసరికి వెళ్లేందుకు దేవరకొండ నుంచి పొగిళ్ల గ్రామం వరకు ఆర్టీసీ బస్సులు ఉంటాయి. ఉదయం 5.30, 8.30, మధ్యాహ్నం 12.30, సాయంత్రం గంటలకు రోజుకు నాలుగు సర్వీసులు నడుస్తాయి. పొగిళ్ల గ్రామంలో దిగి కిలోమీటరుకు పైగా దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుంచి పొగిళ్ల వరకు 170 కిలోమీటర్ల దూరం ఉంటుంది.



గవ్వలసరి.. జాలువారుతున్న నీరు

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

వెనుకబడిన ప్రాంతమైన పొగిళ్లలో గవ్వలసరి, దేవరచర్ల మునిశ్వర ఆలయాలను కలిపి ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా స్థానిక నాయకులు కృషిచేయాలి. ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు స్థానికులకు ఉపాధి దొరుకుతుంది.

● నేతాళ్ల వెంకటేష్, పొగిళ్ల

పాతాళ గంగ పైపైకి

ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లాలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు అలుగు పోస్తున్నాయి. దీంతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. బావులు, బోర్లతో జలధార ఉబికి వస్తోంది. భువనగిరి శివారులో రామకృష్ణాపురంలో వ్యవసాయ బావుల వద్ద మోటర్లు దాదాపు నాలుగు మీటర్ల పైగా ఎత్తులో జలాలు చిమ్ముతున్నాయి. వర్షాలకు భూగర్భజలాలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి





రామకృష్ణాపురం గ్రామ శివారు వ్యవసాయ పొలాల వద్ద మోటర్లతో ధారాళంగా వస్తున్న నీరు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సారా నిర్మూలనకు ప్రత్యేక గస్తీ బృందాలు

తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత



తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని తుంగతుర్తి, మద్దిరాల, నూతన్‌కల్, అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి మండలాల పరిధిలో నెలకు రూ.16కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతాయని తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఆదివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● (తుంగతుర్తి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: సారా నిర్మూలనకు ఏ విధంగా స్పందిస్తున్నారు?

ఎక్సైజ్ సీఐ: తుంగతుర్తి సర్కిల్‌లో నాటు సారా నిర్మూలనకు ప్రత్యేక గస్తీ బృందాలు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: తుంగతుర్తి సర్కిల్‌లో ఎన్ని వైన్‌షాపులు ఉన్నాయి. నెలకు ఎంత ఆదాయం వస్తుంది ?

ఎక్సైజ్ సీఐ: తుంగతుర్తి సర్కిల్‌లో ఆరు మండలాల్లో 17వైన్‌షాపులు, రెండు బార్లు ఉన్నాయి. నెలకు సుమారు రూ.16కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: తుంగతుర్తి సర్కిల్ ఎన్ని గీతకార్మిక సంఘాలు ఉన్నాయి? కార్మిక సభ్యత్వాలు ఎన్ని ఉన్నాయి?

ఎక్సైజ్ సీఐ: తుంగతుర్తి సర్కిల్ 72 గీతకార్మిక సంఘాలు, 8600 మంది సభ్యులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎంత పెండింగ్‌లో ఉంది.?

ఎక్సైజ్ సీఐ: తుంగతుర్తి సర్కిల్‌లో 27 మంది గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉన్నాయి.

మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

హుజూర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మాంసం విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా హుజూరనగర్‌లో రోడ్ల వెంట విక్రయిస్తున్న మాంసం విక్రయాలను ఆదివారం ఆయన పరిశీలించారు. రోడ్ల వెంట మాసం విక్రయించడం సరికాదన్నారు. దుకాణాల వద్దనే మాంసం విక్రయించాలన్నారు. పట్టణంలో మొత్తం 46 చికెన్, మటన్, చేపలతోపాటు వివిధ మాంసాలకు చెందిన విక్రయశాలలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

మట్టి గణనాథులనే పూజిద్దాం



● ప్రకృతిని ఆరాధించాలంటున్న పర్యావరణ పరిరక్షకులు
● మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పంపిణీకి సిద్ధంగా మట్టి విగ్రహాలు

వినాయక ఉత్సవాల సమయం దగ్గర పడుతోంది. ఊరూరా, వాడవాడలా గణపతి ప్రతిమల ఏర్పాటు, గీతాల హోరు, ఊరేగింపు ల సందడి ప్రారంభం కానుంది. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పూజించిన గణనాథులను నిమజ్జనం చేయ డం ఆనవాయితీగా వస్తోంది. అయితే మట్టికి బదులుగా రసాయనాలతో చేసిన విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడంతో మానవాళితో పాటు జలరాశులకు హాని కలుగుతోంది. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాలనే పూజించాలని, ప్రకృతి ప్రసాదించిన పత్రినే ఉత్సవాలకు వినియోగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలూ వహిస్తున్నాయి. పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్)తో తయారు చేసి, రంగులు, రసాయనాలద్దే విగ్రహాలతో కలగనున్న నష్టాన్ని ప్రజలకు వివరిస్తున్నాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో మట్టి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి, కస్తూరి ఫౌండేషన్, తలకోల శ్రీధర్‌రెడ్డి సంస్థ మట్టి విగ్రహాలను ఏటేటా పంచుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ. రసాయనాలు, రంగులతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే జలం కాలుష్యమవుతుంది. ప్లాస్టిక్ ఉత్పత్తులను ఉత్సవాలకు వినియోగిస్తే అనేక దుష్ప్రభావాలున్నాయి. నీటిలో సులభంగా కరిగే విగ్రహాలను, ప్రకృతి ప్రసాదించిన పూలు, పత్రిని ఉత్సవాలకు ఉపయోగించాలి. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు 4 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం. మరికొన్ని మట్టి విగ్రహాల పంపిణీకి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నాం.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

మట్టి వినాయకుడి విగ్రహాలు చేయడం ఆనందంగా ఉంది



వినాయక చవితి వచ్చిందంటే మట్టి వినాయక విగ్రహమే మదిలో మెదలవుతాయి. మట్టిని కొనుగోలు చేసి 14 ఏళ్లగా విగ్రహాలను తయారు చేస్తున్నాను. కుల వృత్తి తనకు రావడంతో విగ్రహాలు తయారు చేయడం సులువైనది. విగ్రహాలను తయారు చేస్తున్నప్పుడు ఎంతో సంతోషం కలిగేది. పెద్ద విగ్రహాలతో పాటు చిన్న విగ్రహాలు తయారు చేయగా వాటిని చూసి న వారు మెచ్చుకునే వారు. మరికొందరైతే పొగడ్తలు అభినందనలతో ముంచెత్తేవారు. రానురాను విగ్రహాలు తయారు చేయడం తగ్గడంతో తమ నివాసం వరకే తయారు చేసుకుంటున్నాను.

- మండలోజు వినయ్, గుండ్రాంపల్లి, చిట్యాల మండలం

పద్నాలుగేళ్లుగా మట్టి గణనాథుల తయారీ..

చిట్యాలరూరల్ : పర్యావరణానికి హానికరం లేని మట్టి విగ్రహాలను పూజించాలని ప్రభుత్వం, పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన మండలోజు వినయ్ మట్టి విగ్రహాలను తయారు చేసి స్నేహితులతో కలిసి కాలనీలో ఏర్పాటు చేసుకోవడమే కాకుండా నివాసాల్లో పూజ చేసే వారికి వినాయకుడి ప్రతిమలను ఉచితంగా అందజేస్తున్నాడు మొదట్లో వినయ్ సరదాగా మట్టి వినాయకుడి విగ్రహాన్ని తయారు చేయాలనే ఆసక్తి కలగడంతో స్థానికంగా మట్టిని సేకరించి విగ్రహాన్ని చేసి నివాసంలో నిలిపి పూజించాడు. వృత్తి రీత్యా ప్రైవేటు ఉద్యోగి అయినా కులవృత్తి వడ్రంగి కావడంతో విగ్రహాన్ని తయారు చేయడం సులువు కావడంతో 14 ఏళ్ల క్రితం మట్టిని సేకరించి కొన్ని వినాయకుడి విగ్రహాలను తయారు చేశాడు. అనంతరం విగ్రహాల తయారీకి హైదరాబాద్‌లో దానికి సంబంధించిన మట్టిని కొనుగోలు చేశాడు. ముందుగా 2,4 అడుగులు, తరువాత 5, 6, 8 అడుగుల విగ్రహమే కాకుండా ఏకంగా 10 అడుగుల విగ్రహాన్ని తయారు చేశాడు.



అందమైన రంగులు..ఆకట్టుకునే రూపాలు

వినయ్ విగ్రహాలను ఏటా వివిధ రూపాల్లో దేవతామూర్తుల చిత్రాలతో కలిపి తయారు చేస్తుంటాడు. వాటికి రంగులను అద్ది అందమైన రూపం వచ్చేలా చేస్తుంటాడు. అంతే కాకుండా చిన్నచిన్న మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేసి స్నేహితులు, స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తుంటాడు. వినయ్ తాను తయారు చేసిన మట్టి వినాయకుడిని ఆయన నివాసం సమీపంలో ఏర్పాటు చేసి సుమారు 12 ఏళ్ల వరకు పూజలు నిర్వహించాడు. అనంతరం కొందరు స్నేహితులు వివిధ ప్రాంతాల్లోకి వెళ్లడంతో పెద్ద విగ్రహం ఏర్పాటు చేయడం నిలిపివేశారు. అయితే తన నివాసంలో నిలుపుకునేందుకు మట్టి విగ్రహాన్ని తయారు చేసుకుంటున్నాడు. ఈ ఏడాది తాను తయారు చేసిన వినాయకుడి విగ్రహం వెనుక విష్ణుమూర్తి అవతారం, పక్కన గరుడ వాహనం, మూషికం, అర్జునుడు నిల్చుండగా రథాన్ని నడుపుతున్న శ్రీకృష్ణుడి ప్రతిమ, మరో వైపు అర్జునుడికి గీతను బోధిస్తున్న అర్జునుడి చిత్రాన్ని తయారు చేశాడు. ఆ విగ్రహానికి రంగులు అద్ది తుది రూపానికి తీసుకువచ్చాడు.



యోగాలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న చిన్నకాపర్తి విద్యార్థి

చిట్యాలరూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యోగాసనాల్లో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తికి చెందిన సౌమ్య విద్యామందిర్ పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, ప్రిన్సిపల్ బొడిగె విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రుద్రారపు మల్లేష్ తెలిపారు. యోగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఆదివారం జిల్లా యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025 అండర్ 8-10 బాలుర విభాగంలో నిర్వహించగా చిన్నకాపర్తికి చెందిన విద్యార్థులు పొలిమెర అజయ్‌కుమార్, రొండి సాయిజశ్వంత్ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులకు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, ప్రధానకార్యదర్శి నంద్యాల రాజశేఖరరెడ్డి, సహాయకారదర్శి నిరసనమెట్ల నాగార్జునలు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్ఎస్ఎస్ జాతీయ శిబిరానికి సాగర్ గురుకుల విద్యార్థులు



అజయ్ , శశికుమార్

నాగార్జునసాగర్,ఆగస్టు24(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎస్ఎస్ జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ శిబిరానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం తమిళనాడులోని తంజావూరులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శశికుమార్, అజయ్ బీఏ తృతీయ, ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు లలిత, కృష్ణ, అధ్యాపకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలన్నీ చేనేతలకు వర్తింపజేయాలి



యాత్రలో సంఘీభావం వ్యక్తం చేస్తున్న చేనేత నాయకులు

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను చేనేతలకు వర్తింపచేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం చేనేత జాతీయ ఇన్‌చార్జి బొల్ల శివశంకర్, ఏబీపీఎస్ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్దపు మురళి కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో అఖిలభారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నేతన్న యాత్ర నిర్వహించారు. ఈ సందర్భం గా గ్రామంలో ర్యాలీ చేపట్టి చేనేత మహిళ ప్రతినిధుల ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేనేత వర్గా ల కోసం హ్యాండ్లూమ్ బోర్డులు, మార్కెటింగ్ ఇన్సెంటివ్, త్రిబుల్ ఆర్, బుంకర్ బీమా, ఐసీఐసీఐ లాంబార్డు హెల్త్ స్కీమ్, వర్క్ షర్ట్ వంటి ఎన్నో పథకాలను రూపొందించి చేనేతను ఆదుకున్నారని వారు తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న పథకాలను రద్దుచేసి చేనేతపై జీఎస్టీ విధించిందని వారన్నారు. ఐదేళ్లుగా చేనేతపై విధించిన జీఎస్టీని తొలగించాలని దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తూ ఎంతోమంది ఎంపీల ద్వారా పార్లమెంట్‌లో గళం వినిపించినా ప్రభుత్వ స్పందించకపోవడం శోచనీయమన్నారు. పద్మశాలీలకు హ్యాండ్లూమ్ కార్పొరేషన్, పవర్ లూమ్ కార్పొరేషన్ పదవులు వెంటనే కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహిళా ప్రధానకార్యదర్శి చిలువేరు సనీత, రామచందర్‌రావు, నాయకులు అవ్వారి భాస్కర్, మాచర్ల రామచందర్, చిక్క వెంకటేశ్వర్లు, చిలువేరు సునీత, గుంటక రూప, బొమ్మ ప్రవల్లిక , సామల భాస్కర్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా మార్కండేయ, కొండ లక్ష్మణ్ బాపూజీ, చిత్రపటాలకు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహిళల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది.

కృష్ణమ్మ పరవళ్లు..పర్యాటకుల కేరింతలు

● సాగర్ 26 గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల ● అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఓవైపు కృష్ణమ్మ పరవళ్లు.. మరోవైపు పర్యాటకుల కేరింతలు సాగర్‌లో కనువిందు చేస్తున్నాయి. ఎగువనుంచి వరద రాక, ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల రాకతో నాగార్జునసాగర్ పరిసరాలు సందడిగా మారాయి. వారం రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం సాగర్ జలాశయానికి ఎగువ నుంచి 4,16,324 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, నీటి మట్టం 585 అడుగులు (297.4350టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల నుంచి 3,63,714 క్యూసెక్కుల నీటిని దిగువ కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,16,324 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 4,16,324 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తుండడం, ఆదివారం సెలవుదినం కావడంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, కొత్తవంతెన, ప్రధాన జల విద్యుత్ కేంద్రంవద్ద పర్యాటకుల రద్దీ నెలకొంది. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దులో కొత్త వంతెన వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొంది. తెలంగాణ నుంచి ఏపీకి, ఏపీ నుంచి తెలంగాణకు వాహనాలు కొత్త వంతెన మీదుగా రావడానికి గంట సమయం పట్టింది.



నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి



మూసీ రిజర్వాయర్ 3 క్రస్ట్ గేట్ల నుంచి విడుదలవుతున్న వరద

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 13 రోజుల పా టు ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి అధికారులు వరద నీటిని దిగువ మూసీ వదలుతున్నారు. శనివారం 4,368.14 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి భారీగా తగ్గి 1,702.87క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్టు నీటి మట్టం 643.45 అడుగుల గరిష్టస్థాయికి చేరడంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు 2, 3, 8 నంబరు క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 1,935.51 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు మరో 575.64 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.45 అడుగులు (4.06 టీఎంసీలు)గా ఉంది.

నామినేటెడ్‌పై ఆశలు

(5వపేజీ తరువాయి)

ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముత్తినేని వీర య్య (హుజూర్‌నగర్) నియమితులయ్యారు. వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు.

గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచింది. స్థాని క సంస్థల ఎన్నికలూ లేకపోవడంతో ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు మినహా ఇతర నాయకులెవ్వరికీ ప్రొటోకాల్ సైతం వర్తించకపోవడంతో అధికారిక కార్యక్రమాల నిర్వహణ, అధికారులతో సమీక్షల్లో సైతం స్థానిక నాయకత్వానికి ప్రాతినిథ్యం లేకుండాపోయింది. పార్టీ పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న సందర్భంలో బరిగీసి కొట్లాడిన వారికి నామినేటెడ్ పదవులిచ్చే కార్యక్రమం తరచూ వాయిదా పడతూ వచ్చింది. దీంతో తమ సంగతేంటని, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా, నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని నిర్ణయించడంతో జిల్లాలో ఆశావహులు మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించారు.

అవకాశం దక్కేదెవరికో?

ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల ను ఆశిస్తున్న నేతల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు మొదలు కీలకమైన ద్వితీయశ్రేణి నేతలం తా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారు. కీలకమైన యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మం డలి చైర్మన్, బోర్డు సభ్యుల పదవులతో పాటు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు, జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల చైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కుదుదుల నగేశ్ కీలకమైన పదవి వస్తుందనే విశ్వాసంలో ఉన్నారు. కీలకమైన యాదాద్రి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి దక్కించుకోవడానికి ఉమ్మడి జిల్లా నేతలతో పాటు, ఇతర జిల్లాల నేతలూ, పారిశ్రామికవేత్తలూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ పదవిని యాదాద్రి జిల్లాకు చెందిన నేతలకే ఇవ్వాలని స్థానిక నేతలు సీఎం, మంత్రుల వద్ద డిమాండ్ చేస్తుండడంతో దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

● నకిరేకల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్యకు సైతం రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమని తెలుస్తోంది. మరోవైపు దైద రవీందర్, అన్నెపర్తి జ్ఞానసుందర్ కూడా కార్పొరేషన్ పదవులకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మి, నల్లగొండ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి మహిళా కోటాలో కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని ముఖ్య నేతలను కోరుతున్నారు.

కడసారి వీడ్కోలు కోసం..



సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీపీఐ చిట్యాల మండల నాయకులు

చిట్యాలరూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతిచెందగా ఆదివారం జరిగిన అంతిమయాత్రలో చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన సీపీఐ నాయకులు తరలివెళ్లారు. సుధాకర్‌రెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి రెడ్ సెల్యూట్ చేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. సుధాకర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొడిగె సైదులు, జిల్లా యాదయ్య, జిల్లా సత్యం, కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, జిల్లా లక్ష్మయ్య, బొడిగె బక్కశెట్టి, బొబ్బల శంకర్‌రెడ్డి, గోపగోని శేఖర్, జిల్లా లింగస్వామి, పానుగుళ్ల శివ, బెదరకోట సైదులు, రత్నం లింగస్వామి, స్వామి, గోపగోని కిరణ్, వెంకటేశం పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డికి పాల్వాయి స్రవంతి నివాళి

మునుగోడురూరల్: సురవరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి పార్థివదేహంపై ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం నింపారు. ఆమె వెంట నాయకులు మారగోని అంజయ్యగౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, లింగస్వామి, శ్యాం, రమేష్, విజయ్, నగేష్ ఉన్నారు.

యాదగిరిక్షేత్రం.. భక్తజనసంద్రం

యాదగిరిగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రం భక్తజనసంద్రమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉభయ క్యూలైన్లు, ఆలయ తిరువీధులు కిక్కిరిశాయి. ఇష్టదైవాల దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు వాహనాలపై తరలివచ్చారు. 52 వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో రద్దీ కొనసాగింది. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. ప్రత్యేక దర్శనానికి గంట, ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 55.16లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. స్వామిని ఎంబీసీ కార్పొరేషన్ (తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి సంస్థ) చైర్మన్ జెరిపేటి జైపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని గర్భాలయంలోని స్వయంభువుల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. వారిని ఆదివారం సాధారణ పరిపాలన కార్యదర్శి (సెక్రటరీ జనరల్ అడ్మినిస్ట్రేషన్) రఘునందన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయగా స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.



యాదగిరిగుట్ట ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

కొండపై ఈవో ఆకస్మిక తనిఖీలు

లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ఆదివారం ఈవో ఎస్. వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రసాదాల తయారీ కేంద్రం, ప్యాకింగ్, విక్రయాలు, పారిశుధ్య విభాగాలను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. భక్తులకు అందించే ఉచిత ప్రసాద వితరణకు అధునిక యంత్ర పరికరాలు తెచ్చేందుకు అధికారులను ఆదేశించారు. తక్కువ ధరలకు రెస్టారెంట్ అందుబాటులోకి తేవాలని భక్తులు ఈవోను కోరారు.

కెనడాలో లక్ష్మీనృసింహుల కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవం కెనడా దేశంలో వైభవంగా జరిగింది. తెలుగు వారితో పాటు ఇతర భారతీయుల కోసం తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విండ్‌సర్ నగరంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని యాదగిరిగుట్ట ప్రధానాలయ విశ్రాంత ప్రధానార్చకుడు నల్లందిగల్ లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో విండ్‌సర్ నగర ఎంపీ అంద్రోడావీ, ప్రముఖులు అర్బెజిల్, ఆలయ ఏఈవో గజ్వేల్లి రఘుతో పాటు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కెనడాలో యాదగిరీశుడి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

స్నేహితుని కుటుంబానికి 1.30లక్షల ఆర్థిక సాయం

శాలిగౌరారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమతో చదువుకున్న సహచరుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి అండగా మేమున్నామని స్నేహితులు ఆర్థికసాయం చేశారు. శాలిగౌరారానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు మహేష్ ఇటీవల మృతిచెందాడు. మహేష్‌తో కలిసి చదువుకున్న జడ్పీ హైస్కూల్ 2002-2003 బ్యాచ్ విద్యార్థులు రూ.1.30లక్షలను మహేష్ కుటుంబసభ్యులకు అందజేశారు. విజ్ఞానజ్యోతి హైస్కూల్ విద్యార్థులు కూడా రూ.27 వేలు అందజేసి అండగా నిలిచారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

కనగల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురంపల్లి గ్రామంలో పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జెస్సీపాల్ మాట్లాడుతూ పేదలను ఆదుకోవటం తమ బాధ్యత అని, తమ సాయం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డొడ్డి సరోజ, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ కోఆర్డినేటర్ సాల్మన్, జిల్లా కోఆర్డినేటర్ శ్యాంసన్ పాల్గొన్నారు.

ఆగని ఆకతాయిల ఆగడాలు

» పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు » గ్రామాల్లో అధికమవుతున్న ఆకతాయిల ఆగడాలు

కేతేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆకతాయి యువకుల ఆగడాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. వారి ఆగడాలకు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలు, తరగతి గదులు, మరుగుదొడ్ల తలుపులు, కిటికీలు ధ్వంసమవుతున్నాయి. సాయంత్రం 6 నుంచి 7గంటల మధ్య యువకులు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విషయాన్ని గ్రామ పెద్దలకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం కేతేపల్లిలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ పాఠశాల ఆవరణలోని తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు, తరగతి గదుల తలుపులు, కిటికీలను కొంతకాలంగా ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారు. 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట గల చర్చి వెనక వైపున గల జడ్పీ హైస్కూల్ ఆవరణలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎంఈవో కార్యాలయం, భవిత కేంద్రం ఉన్నాయి. ఈ ఆవరణకు మూడు వైపులా ప్రహరీగోడ ఉండి మరోవైపు ప్రహరీ గోడ నామమాత్రంగా ఉంది. పాఠశాలల పని వేళలు ముగియగానే ఈ ఆవరణకు గల మెయిన్ గేటుకు తాళం వేస్తారు. అయినా పాఠశాలకు వాచ్‌మన్ లేకపోవడంతో సాయంత్రం సమయంలో గోడలు, గేటు దూకి ఆవరణలోకి ప్రవేశించే స్థానిక ఆకతాయి మూక ఈ ఆవరణను తమ అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటారనేది బహిరంగ రహస్యమే. ఇటీవల మంగళవారం రాత్రి కొంత మంది ఆకతాయిలు కేతేపల్లి జడ్పీ పాఠశాల ఆవరణలో


కేతేపల్లి జడ్పీ పాఠశాల ఆవరణలో జెండా దిమ్మె వద్ద ఆకతాయిలు పగులగొట్టిన బీరు సీసాలు ముక్కలు

మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడి జెండా దిమ్మెపై పగులగొట్టి వెళ్లారు. ఆకతాయిల ఆగడాలను పాఠశాల హెచ్‌ఎం సోషల్ మీడియా గ్రూపు ద్వారా స్థానికులకు వివరించారు. పాఠశాలలో ఆకతాయి మూకల అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు స్థానికులు దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

పాఠశాల ఆవరణలో విచ్చలవిడిగా మద్యం తాగి బాటిళ్లను ధ్వంసం చేసి వెళ్తున్నారు. చెప్పులు లేకుండా పాఠశాల ఆవరణలో తిరిగే పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి గాజు పెంకులు గుచ్చుకుని పలుమార్లు గాయపడ్డారు. ఆకతాయిల ఆగడాలను పోలీసులు, గ్రామ పెద్దలకు వివరించాం. దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.
- యానాల నర్సిరెడ్డి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, కేతేపల్లి


శిథిలావస్థలో యునానీ ఆస్పత్రి

● వైద్యానికి దూరమవుతున్న రోగులు


శివన్నగూడలో శిథిలావస్థలో ఉన్న యునానీ ప్రభుత్వ ఆస్పత్రి

మర్రిగూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన యునానీ ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైనందున ఇక్కడి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం 50 సంవత్సరాల క్రితం యునానీ ఆస్పత్రిని ప్రారంభించింది. ఈ ఆస్పత్రి భవనం జీర్ణావస్థకు చేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రోగులు వైద్యసేవలు నోచుకోలేకపోతున్నారు. ఇక్కడ ప్రజలు ఎక్కువ ఫ్లోరైడ్ గురై కాళ్లు వంకర నడుము వంగి నడవలేని స్థితిలో ఉన్నారు. శివన్నగూడ గ్రామంలో నిర్మించిన ఈ ఆస్పత్రి పరిధిలో నామాపురం, కొట్టాల, మేటిచంద్రపురం, ఇందుర్తి, సారంపేట, గర్నగడ్డ, పాకగూడ, లంకలపల్లి, చర్లగూడెం, రాంరెడ్డిపల్లి, వెంకపల్లి, వెంకపల్లితండా, నర్సిరెడ్డిగూడెం, ఖుదాభక్ష్‌పల్లి, అంతంపేట, సోమరాజుగూడ, రాజ్యా తండా, రంగం తండా భూజ్యతండా, పలు గ్రామాలు ఉన్నాయి. పరిధిలో సుమారు 20వేల జనాభా గల ఈ ప్రాంతంలో ఎక్కువగా ఫ్లోరైడ్ బాధితులే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలకు యునాని ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ ప్రాంతంలో ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. ఈ భవనం మరమ్మతులకు నోచుకోలేక శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు వైద్యులు కూడా సరైన సమయానికి రావడం లేదు. దీంతో వైద్యసేవలు పొందేందుకు వచ్చిన వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న యునానీ ప్రభుత్వ ఆస్పత్రిని తొలగించి నూతన భవనాన్ని నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందేవిధంగా చూడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలి



ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైనందున వైద్యం కోసం నిత్యం ఎంతో మంది రోగులు వస్తారు. యునానీ ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో సరైన వసతులు లేక ఎప్పుడు కూలిపోతుందని ప్రాణాలు అరచేతులో పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఆస్పత్రిలో ఉన్నంతసేపు భయపడుతూ ఎప్పుడు వెళ్లాలనే ఆలోచనతో కొంతమంది వైద్యం చేసుకోకుండానే వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించి రోగులకు వైద్య సేవలు అందే విధంగా చూడాలి. - ఇరగదిండ్ల సత్తయ్య, శివన్నగూడెం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

580 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

ఆంజనేయులు, సీఈవో, సింగిల్‌విండో శాలిగౌరారం



శాలిగౌరారం ప్రాథమిక సహకార సంఘం సేవలను సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాలిగౌరారం సింగిల్‌విండో సీఈవో ఆంజనేయులు అన్నారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 580 మెట్రిక్ టన్నుల యూరియా అందజేసినట్లు ఆయన తెలిపారు.
- (శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: సింగిల్‌విండో పరిధిలో ఎంతమంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు?

సీఈవో: తమ సింగిల్‌విండో పరిధిలో మొత్తం 5115 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక, గోల్డ్ రుణాలు ఇచ్చారు?

సీఈవో: 1580 మంది రైతులకు రూ.3కోట్ల 73లక్షల 85వేల 699 మేర స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చాం. 415 రైతులకు రూ.4 కోట్ల 63 లక్షల 18వేలు గోల్డ్‌లోన్ ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి:సొసైటీపరిధిలో యూరియా నిల్వలు ఏ మేరకు ఉన్నాయి?

సీఈవో: సొసైటీ పరిధిలో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉంచాం. ఈ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 580 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అధికారుల సూచన మేరకు రైతులకు పంపిణీ చేశాం.

ఆంధ్రజ్యోతి: యూరియా విక్రయాలు ఎలా చేస్తున్నారు?

సీఈవో: రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు తీసుకొని పీవోఎస్ మిషన్ ద్వారా రైతు వేలి ముద్ర ఆధారంగా విక్రయిస్తున్నాం. అధికారుల సూచన మేరకు రైతుకు 3 బస్తాల చొప్పున ఇస్తున్నాం.

రైతులతో ప్రభుత్వాల చెలగాటం : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు

నల్లగొండరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, యూరియాను సకాలంలో రైతులకు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు అన్నారు. పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 9.80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేంద్రం కేవలం 5.32లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. రైతులు వరి పంటకు సరైన సమయంలో యూరియా వేయకపోతే దిగుబడి తగ్గి నష్టం వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంటను కాపాడుకోవడం కోసం రైతులు రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు వారికి ఇష్టం వచ్చినట్లుగా, రైతులను కించపరిచే విధంగా ప్రకటనలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన యూరియాని రైతులకు పంపిణీ చేయకుండా ఇబ్బందులు పెడుతూ బ్లాక్ మార్కెట్‌గా తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కొండ వెంకన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించాలి: సీపీఎం

గట్టుప్పల్: యూరియా కొరతను నివారించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు పగిళ్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూరియా కొరత కారణంగా రైతులు తెల్లవారుజామున 5 గంటల నుంచి క్యూలైన్‌లో కూర్చొని సొమ్మసిల్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరత నివారించాలని డిమాండ్ చేస్తూ 25వ తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో డైరెక్టర్ అచ్చిన శ్రీనివాస్, సీపీఎం నాయకులు బీరప్ప, మారయ్య, భిక్షం, బండారు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మకు బోనాలు


నార్కట్‌పల్లిలో పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న యాదవులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలకేంద్రంలో యాదవుల పెద్దమ్మ తల్లికి బోనాల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. తమ ఇష్టదైవమైన పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు భక్తితో చేసిన నైవేద్యాన్ని తీసుకెళ్లారు. సంప్రదాయ డోలు నృత్యాలు, పోతురాజుల ఆట పాటల మధ్య ప్రదర్శనగా వెళ్లిన యాదవ మహిళలు పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, దుబ్బాక శ్రీధర్, జెనిగె బిక్షం, బొబ్బలి దేవేందర్, శ్రవణ్, పర్రెపాటి గోపాల్, లింగస్వామి, యాదగిరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి


వెలిమినేడులో స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చిట్యాలరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు అరూరి శ్రీను, నెల్లికంటి నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని వెలిమినేడులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని, ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ దుర్వాసన రావడం, దోమలు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ నీరు పంట పొలాల్లోకి చేరుకుని పంటలు దెబ్బతింటున్నాయని, జాతీయ రహదారి పక్కన మురుగుకాల్వను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, మోహన్‌రెడ్డి, శంభయ్య, దుర్గయ్య, స్వామి, సత్తయ్య పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడిగా హరిప్రసాద్

రామగిరి ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘం నల్లగొండ పట్టణ అధ్యక్షుడిగా సొల్లేటి హరిప్రసాద్ రెండోసారి ఎన్నికయ్యారు. పట్టణంలోని వాసవీభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో సొల్లేటి హరిప్రసాద్ తన సమీప ప్రత్యర్థి సొల్లేటి కృష్ణకుమార్ పై 180 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా తాడూరు చలమయ్య చారి, కటకం మహేష్‌లు విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన హరిప్రసాద్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, ప్రధాన కార్యదర్శి ఇనుగుర్తి గోపి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయిన అభ్యర్థులు సంఘ నాయకులతో కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు మహేశ్వరం బ్రహ్మచారి, కన్నెగంటి సత్యనారాయణ, దాసోజు వాసు, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కల చంద్రశేఖర్, గొట్టిముకుల నరసింహచారి, కూరెళ్ల మదనాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే వేముల వీరేశం


అయిటిపాముల గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆదివారం రూ.1.20 కోట్లతో నిర్మించనున్న డైనింగ్‌హాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తాను కూడా ఒకప్పుడు పదవ తరగతి వరకే చదువుకున్నానని, ఎమ్మెల్యేగా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత డిగ్రీ పూర్తి చేశానని పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులు ఐఐటీ కోసం ఉద్దీపన ఫౌండేషన్ ద్వారా ఉచిత కోచింగ్, ట్రైనింగ్ కోర్సులను నిర్వహించిన మెటీరియల్‌ను అంద జేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్దీపన ద్వారా నెలకు రూ.6 లక్షల జీతం ఇచ్చుకుంటూ ఉపాధ్యాయులను ప్రైవేట్‌గా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులను ఉద్దీపన ద్వారా ఫీజులు కట్టి చదివిస్తానని తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, డీటీడీవో చత్రునాయక్, ప్రిన్సిపాల్ శంకర్‌కుమార్, వార్డెన్ లక్కుమాల జయమ్మ, మండల స్పెషల్ ఆఫీసర్ సతీష్, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు రెడ్డిపల్లి సాగర్, బెజవాడ సైదులు, ముక్కమాల శేఖర్, గద్దపాటి దానయ్య, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఇవ్వాలి : జనార్దన్‌గౌడ్

నల్లగొండటౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కల్పించకపోతే రానున్న ఎన్నికల్లో బీసీల సత్తా ఏమిటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. బీసీల వాటా కోసం ఎంతటి పోరాటకైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25 తేదీన హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. దీక్షలో జిల్లాలోని మేధావులంతా పాల్గొని విజయవంతం చేయాలని జనార్ధన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొంపెల్లి రామన్న గద్దల మధు, హరీష్, శివ, నరేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే మందుల సామేలు


పెర్కకొండారంలో ఎడ్ల బండిని నడుపుతున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భక్తిభావంతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో గల అప్పల ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎడ్ల బండ్ల ప్రదర్శనలో ఎమ్మెల్యే పాల్గొని బండి నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు, ఉత్సవాలతో ప్రజల ఐకమత్యాన్ని చాటుతాయని పేర్కొన్నారు. ఏడాదిలోగా పెర్కకొండారం నుంచి అడ్లూరు వరకు పక్కా రోడ్డును నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న శాలిగౌరారం నేతాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు బండారు మహేష్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే సామేలు అన్నారు. శనివారం రాత్రి శాలిగౌరారంలో మహేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి రూ.10 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూక కిరణ్ కుమార్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, నాయకులు మంగదుడ్ల శ్రీనివాస్, నూక కిషోర్ కుమార్, జయరాజ్, సైదులు, గణేష్, భద్రయ్య, రంగారెడ్డి, దేవేందర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత


రోడ్డు గుంతల్లో మొరం మట్టి పోయిస్తున్న ఎస్ఐ రాజీవ్‌రెడ్డి

కనగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుమర్లపల్లి గ్రామం వద్ద కనగల్ - చండూరు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఆదివారం మొరం మట్టి పోయించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా వాహనాల రాకపోకలకు సౌకర్యంగా రోడ్డును మార్చారు. ఈ రహదారిపై వర్షం నీరు కారణంగా పెద్దపెద్ద గుంతలు పడి రెండు నెలలుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలు చోటు జరుగుతున్నాయి. గమనించిన ఎస్ఐ రాజీవ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తన సొంత ఖర్చుతో సుమారు 20 ట్రిప్పుల మొరం మట్టిని పోయించారు. దగ్గరుండి డోజర్‌తో రోడ్డును చదును చేయించారు. ఎస్ఐకి స్థానిక గ్రామ నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, కందుల మారయ్య, యాదయ్య, మల్లేష్, సైదులు, రాంబాబు, మధు, వినోద్ తదితరులు సహకరించారు. రోడ్డు గుంతల్లో మొరం మట్టిని పోయించిన శాంతి భద్రతలను కాపడమే కాదు సామాజిక బాధ్యతనూ తీసుకున్న ఎస్ఐ రాజీవ్‌రెడ్డిని పలువురు ప్రశంసించారు.

మండపాలకు చేరుకుంటున్న వినాయక ప్రతిమలు



చిట్యాలరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సమీపిస్తుండగా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నవరాత్రి ఉత్సవ కమిటీలు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన విగ్రహాలను వారి స్వగ్రామాలకు తరలిస్తున్నారు. వివిధ ఆకృతుల్లో విభిన్నంగా ఉండే భారీ విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో వినాయక చవితిని పురస్కరించుకుని పలు కాలనీల్లో వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు అనువుగా మంటపాలు, షామీ యానాలను నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకుని 3, 5, 9, 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహిస్తారు. పూజలనంతరం విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తారు.

చెరువులకు హద్దులు ఎలా?

(5వ పేజీ తరువాయి)

నీటిపారుదలశాఖ ఈఈలు 2024లో కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేశారు. ఆయా డివిజన్లకు చెందిన నియోజకవర్గ ఎమ్మెల్యేలతో చర్చించి వారు సూచించిన చెరువులనే ప్రతిపాదన జాబితాలో చేర్చారు. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన కలెక్టర్ వాటికి పరిపాలనా అనుమతులు ఇచ్చారు. తొలుత ప్రతీ డివిజన్ పరిధిలో రెండు చెరువుల పనులు నిర్వహించేందుకు నిర్ణయించారు. పకడ్బందీగా సర్వే చేసి, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి అటవీశాఖ తరహాలో హద్దుల వద్ద కాంక్రీట్ పిల్లర్లను ఏర్పాటుచేసేందుకు కలెక్టర్ తనకోటా నుంచి రూ.27.18లక్షలు మంజూరు చేశారు. 2025లో మరికొన్ని ప్రాధాన్య చెరువులను గుర్తించి నిధులవ్వాలని అనుకున్నారు.

నిధులు మంజూరైంది ఈ చెరువులకే

ఏఎమ్మార్పీ పరిధిలోని డివిజన్ నెంబర్ 4 నుంచి 7 వరకు ఉన్న తొమ్మిది 9 చెరువులకు తొలివిడత నిధులు మంజూరయ్యాయి. డివిజన్-4 పరిధిలోని గుడిపల్లి మండలం ఘనపూర్‌లోని అక్కుబావి చెరువుకు రూ.3.20లక్షలు, ఇదే మండలంలోని పలుగుచెరువు రూ.3.10లక్షలను మంజూరు చేశారు. డివిజన్-5 పరిధిలో గుర్రంపోడు మండలం కొప్పోలులోని చింతలచెరువు రూ.2.43లక్షలు, కనగల్ మండలంలోని ఊరదక్షిణచెరువుకు రూ.3.35లక్షలు, డివిజన్-6లో నార్కట్‌పల్లి పెద్దచెరువుకు రూ.3.42లక్షలు, నల్లగొండ మండలంలోని కొత్తపల్లి వెల్మరాజు కుంటకు రూ.1.40లక్షలు, డివిజన్-7లో చిట్యాల మండలంలోని వావిలాలచెరువు, శామతోట బావికుంట, మహలింగం చెరువుకు కలిపి రూ.3.83లక్షలు, తిప్పర్తి మండలం కేశరాజుపల్లిలోని మేడికుంట, అనిశెట్టి దుప్పలపల్లిలోని బొప్పరాజుకుంటలకు కలిపి రూ.3.45 లక్షలు, నకిరేకల్ మండలంలోని ఎర్రకుంట, కల్లంవారికుంట, దండకుంటలకు కలిపి రూ.3.00లక్షలు మంజూరు చేశారు. మొత్తం రూ.27.18లక్షల మేరకు ఈఈలు అంచనాలు సమర్పించగా నిధులను మంజూరు చేస్తూ గత కలెక్టర్ నారాయణరెడ్డి పరిపాలన ఉత్తర్వులిచ్చారు.

ఒక్క నార్కట్‌పల్లి పెద్దచెరువు పనులే ప్రారంభం

ఏఎమ్మార్పీ పరిధిలోని నాలుగు డివిజన్లలో తొమ్మిది చెరువులకు నిధులు మంజూరు కాగా, అందులో ఒక్క నార్కట్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ గుర్తింపు కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభించారు. 500మీటర్లకు ఒక పిల్లర్ చొప్పున తొమ్మిది పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. అయితే వీటి నిర్మాణ పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశాడు. గుంతలు తీసి కాంక్రీట్ పిల్లర్లు వేయకుండా వదిలేశాడు. కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు సరిపోవని పనులను నిలిపివేసినట్లు తెలిసింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన అనంతరం కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను పూర్తిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏఎమ్మార్పీ పరిధిలో కేవలం రెండు చెరువులకు సంబంధించిన కాంట్రాక్టర్లు మాత్రమే పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. కాంట్రాక్టర్లను ఎన్ని సార్లు సంప్రదించినా పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.
- యాదన్‌కుమార్, ఐబీ ఈఈ

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585 (297.4350)	4,16,324	4,16,324
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.45 (4.06)	2,571	1,702
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	166.20 (33.18)	3,87,101	3,81,796

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

నామినేటెడ్‌పై ఆశలు



పదవుల పందేరం అనంతరం స్థానిక ఎన్నికలకు

- సెప్టెంబరు నెలాఖరులోగా కొలిక్కి తెచ్చే యోచన
- వినాయక చవితి నుంచి నిమజ్జనం లోగా నామినేటెడ్ భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కాంగ్రెస్ కోర్‌కమిటీలో కీలక నిర్ణయం
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల నియామకాలపై కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. గణేశ్ నిమజ్జనంలోపే నామినేటెడ్ పదవులను భర్తీచేయాలని శనివారం జరిగిన పార్టీ కోర్‌కమిటీ, పీఏసీ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజ్యాంగ, న్యాయనిపుణులతో చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటుచేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందకపోవడంతో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులతో కూడిన కమిటీని కాంగ్రెస్ నియమించింది. వీరు రాజ్యాంగ, న్యాయనిపుణులతో సంప్రదించాలని నిర్ణయించింది. ఈనెల 29న జరిగే క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై తుది నిర్ణయం తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వీలైనంతమేరకు అధికారికంగా 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే వెళ్లాలని,లేని పక్షంలో పార్టీపరంగానైనా రిజర్వేషన్ కల్పించి స్థానిక ఎన్నికల ప్రక్రియను కోర్టు విధించిన సెప్టెంబరు నెలాఖరు గడువులోగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈలోగా గణేశ్ చతుర్థి నుంచి నిమజ్జనం జరిగే లోపు నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తిచేయాలని నిర్ణయించింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లతో పాటు, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పదవులనూ భర్తీ చేయాలని, ఇప్పటికే ఆశావహుల జాబితాలను పార్టీ జిల్లా పరిశీలకులు, ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా అధిష్ఠానానికి, సీఎంకు చేరవేశారు. నామినేటెడ్ పదవుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఉమ్మడి జిల్లాలోనూ ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

నామినేటెడ్‌లో ఛాన్స్ దక్కింది కొందరికే..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అద్దంకి దయాకర్‌కు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. పార్లమెంటు ఎన్నికలకు ముందే తొలి దశలో జరిగిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్‌రెడ్డి (సూర్యాపేట), మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి (ఆలేరు), రాష్ట్ర దివ్యాంగుల

- మిగతా 7వ పేజీలో...

జిల్లా నేతల ప్రయత్నాలు

బీసీ కోటాలో పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్నా కైలాష్‌నేత కార్పొరేషన్ పదవిని ఆశిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి వస్తుందని ఎంపీ ఎన్నికల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగంగా ప్రకటించారు. అయినా ఇప్పటివరకు ఆయనకు పదవి రాలేదని, ఈ దఫా ఖాయమని క్యాడర్‌లో చర్చ సాగుతోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం రాష్ట్ర కార్పొరేషన్లలో కీలక పదవి ఖాయమైందని చెబుతున్నారు. అయితే సామాజిక, జిల్లాల సమీకరణాల్లో మొదటి విడతలో ఆయనకు ఛాన్స్ దక్కలేదని, ఈ దఫా ఖాయమంటున్నారు.

సూర్యాపేట జిల్లాలో..

ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులు వస్తాయనే నమ్మకంలో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న, పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు ముత్తవరపుపాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి కూడా పరిస్థితులు అనుకూలిస్తే కీలక పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి, కీలక నేతలు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, పంజాల రామాంజనేయులుగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, లింగంయాదవ్, తదితర నేతలు కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. వీరితో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన నాయకుల పేర్లను రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. పదవుల పందేరం మొదలయ్యాక ఎవరికి అవకాశం దక్కుతుందో, అవి దక్కని వారిని ఎలా నచ్చజెబుతారనే అంశం తేలనుంది.

చెరువులకు హద్దులు ఎలా?

- ముందుకురాని కాంట్రాక్టర్లు
- 2024లో రూ.27.18లక్షల మేర కలెక్టర్ నిధులు
- ఏఎమ్మార్పీ పరిధి నాలుగు డివిజన్లలో తొలి విడత తొమ్మిది చెరువులు
- పనులు దక్కించుకున్నా చేసేందుకు కాంట్రాక్టర్ల అనాసక్తి

చెరువులను ఆక్రమిస్తున్న రియల్టర్లకు చెక్ పెట్టేందుకు ఎఫ్‌టీఎల్‌లో (ఫుల్ ట్యాంక్ లెవెల్) కాంక్రీట్ హద్దు రాళ్ల ఏర్పాటుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. హద్దురాళ్ల ఏర్పాటుకు నిధులు సరిపోవని, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నార్కట్‌పల్లి పెద్ద చెరువు హద్దు రాళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఒకే ఒక కాంట్రాక్టర్ కూడా పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. అదే సమయంలో నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు బీ.వెల్లెంల రిజర్వాయర్ ద్వారా నీరు చేరడంతో ఎఫ్‌టీఎల్ పనుల కొనసాగింపు డైలమాలో పడగా, మిగతా చెరువుల విషయంలోనూ ఏ కాంట్రాక్టరూ ఆసక్తి చూపడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)



నార్కట్‌పల్లి పెద్ద చెర్వు, నిర్మించనున్న ఎఫ్‌టీఎల్ కాంక్రీట్ పిల్లర్ నమూనా

జిల్లాలో విలువైన చెరువు భూములపై కన్నేసిన రియల్టర్ల కబ్జా పర్వానికి తెరదించాలని గత కలెక్టర్ నారాయణరెడ్డి భావించారు. చట్టంలోని లొసుగులను, అధికారులను అవినీతిని ఆసరా చేసుకొని శిఖం స్థలాలను వెంచర్లుగా మార్చి చేస్తున్న దందాకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సంకల్పించారు. అందులో భాగంగా ఎఫ్‌టీఎల్‌ను (ఫుల్ ట్యాంక్ లెవెల్) గుర్తించి హద్దురాళ్లను పక్కాగాఏర్పాటు చేయడమే సమస్యకు పరిష్కారంగా భావించారు. ముందు ఆక్రమణలకు తావులేని శాశ్వత పరిష్కారానికి మార్గంగా చెర్వులకు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారించి కాంక్రీట్ పిల్లర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా చెర్వుల ఆక్రమణలకు పాల్పడితే సులువుగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని భావించారు.

ప్రతిపాదనలకు పరిపాలనా అనుమతులు

చెరువులు ఆక్రమణకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఏఎమ్మార్పీ పరిధిలోని నాలుగు డివిజన్లకు చెందిన...

- మిగతా 8వ పేజీలో...

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ



కనగల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సింగం లక్ష్మీనారాయణ

కనగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ నెల 25న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష వాల్ పోస్టర్‌ను ఆదివారం బోయినపల్లి గ్రామంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. బీసీ మేధావులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో సత్యాగ్రహ దీక్షకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షం, యాదయ్య, నగేష్, శంకరయ్య, మహేష్, కిరణ్, రామలింగం, మురళి, నర్సింహ, ప్రసాద్, లక్ష్మణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



బుద్ధవనం లోపల కుటుంబ సభ్యులతో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

నాగార్జునసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. బుద్ధవనానికి చేరుకున్న ఆయనకు ఈవో రవిచంద్ర కండువా కప్పి సన్మానించారు. అనంతరం మహాస్తూపం లోపల బుద్ధ జ్యోతిని నారాయణ్ అమిత్ వెలిగించారు. తదుపరి సాగర్ ప్రధానడ్యాం, ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. సాగర్, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. ఆయన వెంట ప్రోటోకాల్ ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు నల్లగొండకు ఇద్దరు మంత్రుల రాక

నల్లగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం నల్లగొండ పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 10.40గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపీ యూనిట్‌కు వారు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మెడికల్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇద్దరు మంత్రుల రాక సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేడు, రేపు ఎన్జీ కళాశాలలో జాతీయ సదస్సు

నల్లగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో జీవశాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 25, 26న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, సదస్సు సంచాలకుడు ఎం.అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, జీవశాస్త్రాల పాత్ర అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందన్నారు. సదస్సును హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ రామాచారి, ఆచార్యులు రాధాకృష్ణన్ ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రొఫెసర్లు పాల్గొని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలను వివరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకొని పఠన సమర్పణ చేయవచ్చని తెలిపారు.

వచ్చే ఏడాది నుంచి 'నవోదయ'లో తరగతులు

- మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష



హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ/ కోదాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కోదాడలో ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు వీలుగా ఈలోపే భవనాల నిర్మాణం, ఇతర అకాడమిక్ ఏర్పాట్లు పూర్తి చేయాలని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కోదాడలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయం భవన నిర్మాణం, పనుల పురోగతిపై కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, జవహర్ నవోదయ విద్యా సొసైటీ అధికారులతో ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యాలయ నిర్మాణానికి నిర్మాణ 19.12ఎకరాల స్థలాన్ని కేటాయించామని, నిర్మాణాల కోసం రూ.50కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనుల నిర్మాణంలో జాప్యం లేకుండా, నాణ్యతలో రాజీ పడకుండా చేపట్టాలని ఆయన సూచించారు. భవనాల నిర్మాణంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని నొక్కి చెప్పారు. మొత్తం క్యాంపస్ వాతావరణం చూడగానే విద్యార్థులకు స్వాగతం పలికేలా ఉండాలని మంత్రి సూచించారు. ఈ ప్రాజెక్టులో నిర్మించే విద్యా భవనాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, వినోద ప్రదేశాల నిర్మాణాలు భవిష్యత్తు అవసరాలకు లోపం లేకుండా ఉండేలా కేటాయించాలని సూచించారు. ఎన్‌వీఎస్ (నవోదయ విద్యా సమితి) ప్రధాన కార్యాలయం ఇప్పటికే టెండర్లను ఖరారు చేసిందని పేర్కొన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడు తూ భవనాలు, ఇతర నిర్మాణాలపై విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా మార్పులు, చేర్పులు సూ చించారు. కోదాడకు ఈ ప్రతిష్ఠాత్మక విద్యాలయం రావడం గర్వకారణమని, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అంద రూ సహకరించాలని ఆమె కోరారు. ఈ సందర్భం గా క్యాంపస్‌లో ప్రతీ భాగం విద్యార్థుల సౌకర్యం, భద్రత ఉండేలా నిర్మాణం జరగాలని ఆమె సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎన్‌వీఎస్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్‌బేరా, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, ఎన్‌బీసీసీ హైదరాబాద్ డీజీఎం అబ్దుల్ రహీం, పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు..
పర్యాటకుల కేరింతలు
7
మట్టి గణనాథులనే పూజిద్దాం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, జీవన విధానం మారుతుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి తెలిపారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంవీఎన్‌సీ విజ్ఞాన కేంద్రంలో జిల్లాస్థాయి యోగా పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. యోగాసనాలు వేయడం జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సెప్టెంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. యోగా పోటీలో జిల్లావ్యాప్తంగా 90మంది బాలబాలికలు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను విజేతలుగా ప్రకటించి మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, ఎస్జీఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కోశాధికారి షహీద్, యోగా కోచ్‌లు నాగార్జున, ఎంవీఎన్‌సీ కార్యదర్శి నర్సిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: 8-10 ఏళ్ల బాలుర విభాగంలో ఎం.వేదాంత్, ఆర్.సాయి నిషాంత్, పి.అజయ్‌కుమార్, కె.షాన్విత్, జె.హాసీష్, బాలికల విభాగంలో దిష్యశ్రీ, కె.శ్రీవిద్య, శ్రీవేదశ్రీ, వర్షిక, కావ్యశ్రీ, 10-12 ఏళ్ల బాలికల విభాగంలో అభిలాషి, శ్రీదేవి, లహరి, బాలుర విభాగంలో కె.అభిరాం, సృజన, శశి విక్రం, హర్షిత్, కార్తీక్ విజేతలుగా నిలిచారు.



ఆసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎనిమిది టర్బైన్ల నుంచి విద్యుదుత్పత్తి

జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్



సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని టర్బైన్‌లు

నాగార్జునసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొదటి టర్బైన్ మరమ్మతులు పూర్తయిందని, ఎనిమిది టర్బైన్ల నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా, అందులో మొదటి టర్బైన్ 110 మెగావాట్ల సామర్థ్యం ఉందని, మిగిలిన ఏడు టర్బైన్లలో ఒక్కో టర్బైన్ 110..8 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉన్న ఎనిమిది టర్బైన్‌ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు అని తెలిపారు. మొదటి టర్బైన్‌ను బీహెచ్‌ఈఎల్ నుంచి 1978లో కొనుగోలు చేసి అమర్చినట్లు పేర్కొన్నారు. ఈ టర్బైన్‌కు మరమ్మతులు చేసి 20సంవత్సరాలు అవుతుండడంతో క్యాపిటల్ ఓవరాల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి టర్బైన్ గైడ్‌వేన్లు అరగడంతో(వార్న్‌అవుట్) విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో, నిలిపివేసిన సమయంలో కాడా నీటి వృథా(నీరు లీకేజీ) ఎక్కువగా అవుతుందని అలా నీటి వృథాతో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయడం కష్టమవుతుందని తెలిపారు. అందుకే బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.7.50 కోట్ల వ్యయంతో నూతన గైడ్ వేన్ మెకానిజాన్ని కొనుగోలు చేసినట్లు సీఈ తెలిపారు. అరిగిన టర్బైన్ గైడ్ వేన్‌ల స్థానే కొత్తవి ఏర్పాటు చేశామని తెలిపారు. మరమ్మతుల కోసం రూ.55లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. మరమ్మతులు పూర్తి కావడంతో శనివారం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఎనిమిది టర్బైన్‌ల ద్వారా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● సోమవారం 25 ఆగస్టు 2025

నేడు శాంతి సంఘం సమావేశం

చందంపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల సందర్భంగా నేడు చందంపేట మండలం పోలేపల్లి వద్ద ధనలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శాంతిసంఘం సమావేశం నిర్వహించనున్నట్లు చందంపేట ఎస్‌ఐ లోకేష్ ఆదివారం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డిండి సీఐ హాజరవుతున్నందున చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని నిర్వాహకులు, డీజే సౌండ్ సిస్టమ్ యజమానులు హాజరుకావాలన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా ప్రతీకైన గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గణేష్ ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, మండపాల వద్ద విద్యుదాఘాతం జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

భూనిర్వాసితులకు అండగా ప్రభుత్వం

● సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్



సబ్‌కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న భూ నిర్వాసితులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భూనిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించింది. ఈ మేరకు ఈ నెల 22న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ ఆంగోతు పర్శానాయక్ మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవతోనే బాధిత కుటుంబాలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆంగోతు బాలు, శంకర్, రూపావత్ దత్తు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌నేత కడారి పెద్దయ్యపై దాడిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడి దేవరకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు కడారి పెద్దయ్యను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. దాడులను సహించేదిలేదని అన్నారు. దాడి చేసినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

హాలియా, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): పెద్దవూర మండల విద్యాధికారి తరి రాము సేవలు అభినందనీయమని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేస్తున్నారని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ అన్నారు. ఉత్తమ ఎంఈవోగా అవార్డు అందుకున్న తరి రాములును ఆదివారం హాలియాలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరి రాము ఉపాధ్యాయుల సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణపురం నిరంజన్, నరందాస్ దుర్గాప్రసాద్, మన్నెం వెంకటేశ్వర్లు, తీరందాస్ రవి, రహీం, అప్పన్న పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని కేంద్రం

● చినపాక లక్ష్మీనారాయణ

హాలియా, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): యూరియా అందించకుండా కేంద్రం రైతులను పట్టించుకోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం హాలియాలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం నాగార్జునసాగర్ నియోజకవర్గస్థాయి సమావేశం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటివరకు 5.32లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఆయా మండలాల కార్యదర్శులు దైద శ్రీను, కందుకూరి కోటేష్, జటావత్ రవినాయక్, నాయకులు ఆకారపు నరేష్, కొప్పు వెంకన్న, కోరే రమేష్, కారంపూడి ధనమ్మ, దొంతాల నాగార్జున, గోగుల ఈద్దయ్య పాల్గొన్నారు.

పాలనను విస్మరించిన ప్రభుత్వం : టీడీపీ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాలనను విస్మరించిందని టీడీపీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చిలకల వెంకన్న అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ విపరీత వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టం జరిగినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాహుల్, సోనియా భజన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రజలన్నీ గమనిస్తూనే ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నూకపంగు కాశయ్య, దాసోజు కాంతాచారి, లావుడి లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దేవరకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 1969లో చదివిన మొదటి బ్యాచ్ విద్యార్థులు కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 55 ఏళ్లుగా కళాశాలలో చదువుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న స్నేహితులు ఒకచోటకు చేరుకొని ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికి ఒకరు యోగ క్షేమాలు తెలుసుకొని గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాము చౌహాన్, బాలరాజు, బాలునాయక్, కొండయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హాలియా, ఆగస్టు24(ఆంధ్ర జ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని ఆదిత్య కేర్ ఆస్పత్రిలో హైదరాబాద్ స్టార్ ఆస్పత్రి, నల్లగొండ రివర్ ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది రోగులకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ల బృందం డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి, డాక్టర్ చిలుకూరి రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ ఎల్.శిరీష, డాక్టర్ నీరజరెడ్డి, సిబ్బంది చెన్ను వీరారెడ్డి, రిక్కల ధనుంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడి ఎన్నిక

చింతపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురంలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మదనాపురం గ్రామానికి చెందిన మెగుతాల యాదగిరిని ఏకగ్రీవంగా గౌడ కులస్థులందరూ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సురిగూరి శ్రీనివాస్, ముద్దం మహేష్ గౌడ్, మొగుతాల శివ, మల్లయ్య, సత్యనారాయణ, శ్రీను, కొప్పుల బుచ్చయ్య, కాసాని జంగయ్య, పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

చింతపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్‌లో ఈ ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కానమోని అరుణ్(23) మండలంలోని కుర్మేడ్‌గేట్‌లోని వైన్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అరుణ్ తండ్రి ఆరేళ్ల క్రితం మృతి చెందగా, ప్రస్తుతం తల్లి ఒంటరైంది. ఈ విషయంపై చింతపల్లి ఎస్‌ఐ రామ్మూర్తిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

శివారుపై శీతకన్ను

● అధ్వానంగా రహదారులు
● గుంతల్లో నిండుతున్న వరద
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు



ఈదులగూడలో ధ్వంసమైన సీసీ రోడ్డు



పట్టణంలోని బంగారుగడ్డలో పిచ్చి, కంపచెట్లతో నిండిన రహదారిది

పేరుకు పట్టణమైనా పాలకుల నిర్లక్ష్యంతో మిర్యాలగూడ పల్లెను తలపిస్తోంది. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో కాలనీలు ఏర్పడుతుండగా, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి మాత్రం కానరావడంలేదు. మట్టి రహదారులు, కంకర తేలిన సీసీరోడ్లు, కంపచెట్లు, కంపుకొడుతున్న వీధులు అక్కడ కనిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ శివారు ప్రాంతాలైన ఈదులగూడ, హైద్లాపురం, చింతపల్లి కాలనీ, రవీంద్రనగర్, ఏడుకోట్లతండా తదితర కాలనీల్లో పూర్తిస్థాయిలో రహదారుల ఏర్పాటు చేయలేదు. ఉన్న మట్టి రోడ్లన్నీ వర్షాల కారణంగా బురదమయంగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పలు కాలనీల్లో కాల్వలు నిర్మించకపోవడం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఆరంభానికి నోచకపోవడంతో మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తోంది.

రహదారులే ప్రధాన సమస్యగా..

కాలనీల్లో ఇతర సమస్యలెలా ఉన్నా.. రహదారుల పరిస్థితి దారుణంగా ఉందంటున్నారు స్థానికులు. రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా ఉంటోందని, కార్లు కాకపోయినా, ద్విచక్ర వాహనాలపై కూడా వెళ్లలేకుండా రహదారులున్నాయని వాపోతున్నారు. కాలనీలు ఏర్పడతున్నప్పటికీ రహదారులు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

దెబ్బతింటున్న సీసీ రోడ్లు

నాణ్యత, ప్రమాణాలు పాటించకుండా వేసిన సీసీ రోడ్లు అనతికాలంలోనే కంకర తేలి కనిపిస్తున్నాయి. ఆయాచోట్ల వర్షపు నీరు నిలిచి మరింతగా డ్యామేజీ అవుతున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో వేసిన సీసీ రోడ్లు పగుళ్లొచ్చి కొద్దికాలంలోనే కంకర రోడ్లను తలపిస్తుండగా ఆయా రహదారుల్లో ప్రయాణించే వారు తమ వాహనాలు చెడిపోతున్నాయని వాపోతున్నారు.

ప్రధాన రోడ్డయినా పట్టించుకోరా ?

పట్టణంలోని ఈదులగూడ చౌరస్తాలోని ప్రధాన రోడ్డు పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారి నుంచి, కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిని కలిపే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఇందిరమ్మ కాలనీ, హైదలాపురం, విద్యానగర్‌నుంచి కోదాడ, ఖమ్మం రూట్లకు వెళ్లే వారికి షార్ట్‌కట్‌గా ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సుమారు వంద మీటర్ల పొడవుండే ఈ రోడ్డును సీసీతో నిర్మించారు. అయితే నాణ్యతా, ప్రమాణాలు లేనికారణంగా కంకర తేలి, పగుళ్లు రావడంతో మురుగు, వర్షపు నీరు నిలుస్తోంది. బాట అంచులు తెగడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా స్పందనలేదంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డంతా గుంతలమయంగా మారింది. వర్షపు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. నార్కట్‌పల్లి- అద్దంకి రోడ్డునుంచి కోదాడ, ఖమ్మం వైపునకు వెళ్లేందుకు దగ్గర దారి కాబట్టి వాహనాలు ఎక్కువగానే తిరుగుతుంటాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని వెంటనే బాగు చేయాలి.

చిమట శ్రీనయ్య, స్థానికుడు

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు

● ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ● హైదరాబాద్‌లో సురవరం భౌతికకాయం వద్ద నివాళి





సురవరం భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న రవీంద్రకుమార్, బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి దేశ రాజకీయాలకు తీరని లోటని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి మృతదేహానికి ఆదివారం హైదరాబాద్‌లోని మగ్దుంభవన్‌లో వేర్వేరుగా పూలమాలలువేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఎంపీగా సురవరం దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. సురవరం మృతికి కాంగ్రెస్, సీపీఐ నేతలు సంతాపం తెలిపారు.

కొండమల్లేపల్లి: సురవరం ఆశయాలు సాధించాలని సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని చౌరస్తా వద్ద సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి బాటలో కార్యకర్తలు పయనించాలన్నారు. కార్యక్రమంలో కల్లు చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, మల్లయ్యచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశీ వద్దు స్వదేశీ ముద్దు

అగ్రదేశం అమెరికా సుంకాల బెదిరింపుతో స్వదేశీ ఉత్పత్తులను కొందాం అనే నినాదం ఊపందుకుంది. డోనాల్డ్ ట్రంప్ భారతదేశానిది 'చనిపోయిన ఆర్థిక వ్యవస్థ(డెడ్ ఎకానమీ)'గా పేర్కొనడం పట్ల దేశాభిమానులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా నెటిజన్లు స్వదేశీ వస్తువులు కొందాం, దేశ ఆర్థికాభివృద్ధికి సాయమందిద్దామంటూ విస్తృత ప్రచారం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

ఆంధ్రజ్యోతి జన వాక్యం

స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి



దేశ ఆర్థికాభ్యృద్ధిలో భాగస్వాములవడం మనందరి బాధ్యత. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతావని మారుతున్న తరుణంలో మనమందరం స్వదేశీ ఉత్పత్తులనే కొనాల్సిన అవసరముంది. విదేశీ వస్తువులను వీలైనంత వరకూ బహిష్కరించాలి. మనం చేసే ప్రతీ కొనుగోలు దేశాన్ని బలోపేతం చేసేదిలా ఉండాలి. స్వదేశీ భావజాలాన్ని కనబర్చాలి.

గూడూరు శ్రీనివాసరావు, మిర్యాలగూడ

స్వదేశీ పరిశ్రమలకు జీవం పోయాలి



స్వదేశీ పరిశ్రమలకు జీవం పోయాల్సిన తరుణం ఆసన్నమైంది. దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడంతోపాటు వ్యవసాయాదాయం పెంచేందుకు దేశ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలి. భావోద్వేగంతో కాకుండా దేశ ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని షాపింగ్ చేయాలి. ఆన్‌లైన్ షాపింగ్‌లో అయినా భారత ఉత్పత్తులనే ఎంచుకోవాలి. ప్రధానంగా మేడ్ ఇన్ అమెరికా, చైనా ఉత్పత్తుల జోలికి వెళ్లొద్దు.

గుండా ప్రసాద్, మిర్యాలగూడ.

బోనం నైవేద్యం



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

డిండి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డిండి మండలకేంద్రంలో యాదవులు తమ ఆరాధ్య దైవమైన లింగమయ్య స్వామి బోనాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన బోనం కుండలను మహిళలు ఎత్తుకొని గ్రామంలోని బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా గ్రామశివారులోని లింగమయ్య స్వామి దేవాలయానికి వెళ్లి బోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెరువులకు హద్దులు ఎలా?

(5వపేజీ తరువాయి)

నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 2024లో కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేశారు. ఆయా డివిజన్లకు చెందిన నియోజకవర్గ ఎమ్మెల్యేలతో చర్చించి వారు సూచించిన చెరువులనే ప్రతిపాదన జాబితాలో చేర్చారు. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన కలెక్టర్ వాటికి పరిపాలనా అనుమతులు ఇచ్చారు. తొలుత ప్రతీ డివిజన్ పరిధిలో రెండు చెరువుల పనులు నిర్వహించేందుకు నిర్ణయించారు. పకడ్బందీగా సర్వే చేసి, ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి అటవీశాఖ తరహాలో కాంక్రీట్ పిల్లర్లను హద్దుల వద్ద ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ తన కోటా నిధులు రూ.27.18లక్షలను మంజూరు చేశారు. 2025లో మరికొన్ని ప్రాధాన్య చెరువులను గుర్తించి నిధులు ఇవ్వాలని అనుకున్నారు.

నిధులు మంజూరైంది ఈ చెర్వులకే

ఏఎమ్మార్పీ పరిధిలోని డివిజన్ నెంబర్ 4 నుంచి 7 వరకు ఉన్న తొమ్మిది 9 చెర్వులకు తొలివిడత నిధులు మంజూరయ్యాయి. డివిజన్-4 పరిధిలోని గుడిపల్లి మండలం ఘనపూర్‌లోని అక్కబావి చెరువుకు రూ.3.20లక్షలు, ఇదే మండలంలోని పలుగుచెరువు రూ.3.10లక్షలను మంజూరు చేశారు. డివిజన్-5 పరిధిలో గుర్రంపోడు మండలం కొప్పోలులోని చింతలచెరువు రూ.2.43లక్షలు, కనగల్ మండలంలోని ఊరదక్షిణచెరువుకు రూ.3.35లక్షలు, డివిజన్-6లో నార్కట్‌పల్లి పెద్దచెరువుకు రూ.3.42లక్షలు, నల్లగొండ మండలంలోని కొత్తపల్లి వెల్మరాజు కుంటకు రూ.1.40లక్షలు, డివిజన్-7లో చిట్యాల మండలంలోని వావిలాలచెరువు, శామతోటబావికుంట, మహలింగం చెరువుకు కలిపి రూ.3.83లక్షలు, తిప్పర్తి మండలం కేశరాజుపల్లిలోని మేడికుంట, అనిశెట్టి దుప్పలపల్లిలోని బొప్పరాజుకుంటలకు కలిపి రూ.3.45 లక్షలు, నకిరేకల్ మండలంలోని ఎర్రకుంట, కల్లంవారికుంట, దండకుంటలకు కలిపి రూ.3.00లక్షలు మంజూరు చేశారు. మొత్తం రూ.27.18లక్షల మేరకు ఈఈలు అంచనాలు సమర్పించగా నిధులను మంజూరు చేస్తూ గత కలెక్టర్ నారాయణరెడ్డి పరిపాలనా ఉత్తర్వులిచ్చారు.

ఒక్క నార్కట్‌పల్లి పెద్దచెరువు పనులే ప్రారంభం

ఏఎమ్మార్పీ పరిధిలోని నాలుగు డివిజన్లలో తొమ్మిది చెరువులకు నిధులు మంజూరు కాగా, అందులో ఒక్క నార్కట్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ గుర్తింపు కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభించారు. 500మీటర్లకు ఒక పిల్లర్ చొప్పున తొమ్మిది పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. అయితే వీటి నిర్మాణ పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశాడు. గుంతలు తీసి కాంక్రీట్ పిల్లర్లు వేయకుండా వదిలేశాడు. కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు సరిపోవని పనులను నిలిపివేసినట్లు తెలిసింది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన అనంతరం కాంక్రీట్ పిల్లర్ల నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను పూర్తిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఏఎమ్మార్పీ పరిధిలో మొత్తం నాలుగు డివిజన్లలో కేవలం రెండు చెరువులకు సంబంధించిన కాంట్రాక్టర్లు మాత్రమే పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. కాంట్రాక్టర్లను ఎన్ని సార్లు సంప్రదించినా పనులు చేయడానికి వారు ఆసక్తి చూపడం లేదు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

యాదన్‌కుమార్, ఐబీ ఈఈ

యూరియా అందుబాటులో ఉంచాలి



చిరుమర్తిలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మాడ్గులపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం బొమ్మకల్, భీమనపల్లి, చర్లగూడెం, పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా సాగు పనులు మొదలు పెట్టిన రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు మండల వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియాను ఆయా పీఏసీఎస్ కేంద్రాలకు తరలించి అందించాలని డిమాండ్‌చేశారు. వ్యవసాయానికి ప్రభుత్వం విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యతతో కూడిన విద్యుత్‌ను అందించాలన్నారు. గ్రామాల్లో బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలను అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, వెంకటాచారి, నాగమణి, సుధాకర్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

పల్లెల్లో సమస్యలు పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు వెంకటేశ్వర్లు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపురం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఐలాపురం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వెంటనే విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షాకాలం కారణంగా మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు నాగేశ్వర్‌రావు, హనుమానాయక్, వెంకటేశ్వర్లు, కృష్ణానాయక్, రూప్లానాయక్, సాయన్న, శ్రీనునాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డా

● అయితే మాకేంటి?



చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ సమీపంలో రహదారిపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొంతమంది హెచ్చరిక బోర్డు ఉన్నా వ్యర్థాలను ఇష్టారాజ్యంగా వేస్తున్నారు. హెచ్చరిక బోర్డుపై సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంది. చెత్తా చెదారం వేసే వారికి రూ.1000 జరిమానా విధిస్తామని రాసినా.. మాకేంటీ అంటూ చెత్త వేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)